ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

ఆగస్టు 2, 2009

SA
43077

నేస్తమా... షుక్రియా...

హ్యాపీ బర్త్‌డే

(2009 ఆగస్టు 2 నుంచి
2009 ఆగసు 8 వరకు)

టి. ప్రణవి- ప్రణతి
1సం॥,ఆగస్టు-2సం॥
అమరేశ్వరి-రామ్మోహన్
వనస్థలిపురం-హైదరాబాద్

సి హెచ్. తరుణ్‌కుమార్
3సం॥,ఆగస్టు-2006
లక్ష్మి-మల్లయ్య
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

కె. సాంకేత్
9సం॥,ఆగస్టు-2000
మాలతి- మల్లికార్జున్
సదాశివపేట

సి హెచ్. కావ్య
ఆగస్టు
వెంకటరమణ-ఎల్లయ్య
పినిరెడ్డిగూడెం ఖమ్మం

యం. ఉమ
ఆగస్టు
శైలజ-మద్దిలేటి
యాపర్ల-మ॥నగర్

మీనాక్షీప్రవల్లిక
2సం॥,ఆగస్టు-2007
స్రవంతి-శ్రీనివాస్
కత్తెరవీధి-శ్రీకాకుళం

యం. గౌతమి(చిన్ని)
3సం॥,ఆగస్టు-2006
శ్రీలక్ష్మి-కురుమయ్య
మహబూబ్‌నగర్



కె. భరద్వాజ్
1సం॥,ఆగస్టు-8
రాజేశ్వరి-శ్రీనివాస్
ఖిలావనపర్తి-కరీంనగర్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

కథా నిలయం
శ్రీకాకుళం

మనలో మాట

ఓ తండ్రి ఘోష!

"అయ్యా! అమ్మా!! నా కొడుకు తప్పిపోయాడు. మీకేమైనా కనిపించాడా? ఇదిగో ఇప్పటిదాకా నా చిటికెన వేలు పట్టుకుని నా వెంటే నడిచాడమ్మా. ఇంతలోనే మారుపడ్డాడయ్యా. రెండేళ్ల పసోడు. ఆకలేస్తే ఏడవడం తప్ప నోరు తెరిచి అడగడం తెలీని అమాయకుడు. నల్ల లాగు, ఎర్ర చొక్కా తొడుక్కున్నాడు. కాళ్లకు చెప్పులు కూడా లేవు. ఎండలో ఎట్టా వున్నాడో ఏమో. మీరుగానీ చూశారా? చూస్తే చెప్పండమ్మా. ఆడు నా ప్రాణం తల్లీ. రాత్రుళ్లు ఈ గుండెల మీద వేసుకొని నిద్ర పుచ్చా వాడిని. ఆడు లేకుండా నేను బతకలేనయ్యా...."

తిరునాళ్లలో తప్పిపోయిన కొడుకుకోసం ఆ తండ్రి పడుతున్న ఆరాటం...ఆవేదన అక్కడ వున్న ప్రతి ఒక్కరిని కదిలించింది. తపించిపోతున్న ఆ తండ్రికి పసివాడు కనిపించాలని మనసులోనే వేడుకున్నారు. తెలీకుండానే తాము వెళ్లిన చోట అతను చెప్పిన గుర్తులున్న పిల్లవాడి కోసం వాళ్ల కళ్లు వెతకసాగాయి.

జనం తోపులాటలో తండ్రి నుంచి విడిపోయిన పసివాడు అటు తిరిగి ఇటు తిరిగి అలసిసొలసి చెట్టు నీడన నిద్రపోతుండగా... చూశారెవరో...! క్షణాల్లో ఆ వార్తను విలపిస్తున్న తండ్రికి చేరవేశారు. అతను పరుగుపరుగున వెళ్లి కొడుకును అక్కున చేర్చుకున్నాడు. ముద్దులు కురిపించాడు. సంతోషంగా ఇల్లు చేరాడు కొడుకుతో సహా.

★★★

(నలభయ్యేళ్ల తర్వాత...అదే తండ్రి రాజధానిలో ఓ బస్టాండ్‌లో కూర్చుని వున్నాడు. వయోభారం వల్ల...తిండి లేకపోవడం వల్ల చిక్కి శల్యమై ఎముకలగూడులా వున్నాడు)

"అయ్యా! మీకు మా అబ్బాయేమైనా కనిపించాడా? పొద్దుననగా నన్ను ఇక్కడ కూర్చోబెట్టి పనిమీద వెళ్లాడయ్యా. చీకటిబడుతున్నా నాకోసం రాలేదంటే.. నా మనసు కీడు శంకిస్తోందమ్మా. ఇంత పెద్ద పట్టణంలో ఆ పిచ్చినాగన్నకు ఏమైందో ఏంటో. నేనే వెతుకుదామా అంటే చూపు ఆనదాయె. పైగా ఊరు కొత్త. మీకు గాని ఆడు కనపడితే ఇక్కడ ఈ ముసలి తండ్రి ఎదురుచూస్తున్నాడని చెప్పండయ్యా..." అని కనిపించిన ప్రతి ఒక్కరిని కాళ్లావేళ్లాపడి వేడుకొంటున్నాడు.

★★★

కొడుకు తనను కావాలనే వదిలించుకున్నాడని ఆ పిచ్చి తండ్రికి తెలీదు పాపం. ఇంకా వస్తాడనీ, ఇంటికి తీసుకెళతాడనీ ఆశగా ఎదురుచూస్తున్నాడు. తండ్రికి కొడుకు మీదున్న ప్రేమకి, కొడుకుకు తండ్రిమీదున్న ప్రేమకి ఎంత వ్యత్యాసం? అరుదుగానైనా తండ్రులను వదిలి వెళ్లిన పిల్లల గురించి పత్రికల్లో వార్తలు వస్తుంటాయి. ఉస్మానియా ఆస్పత్రి సిబ్బందిని కదిలిస్తే ఇలాంటి కథలు బోలెడు.

పనిలేనితనం...పేదరికం...గుండెను బండరాయి చేస్తుందనడానికి నిదర్శనం ఈ సంఘటనలు. తనను కన్నవారా? తను కన్నవారా? అన్న ప్రశ్న ఉదయించినప్పుడు మనసు రెండోవారివైపే మొగ్గుచూపుతుందేమో. ఆకాశంలో ధరలు అధఃపాతాళంలో ఆదాయాలు. కారణమేమైనా కడుపు తరుక్కుపోతుంది. తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదేనని న్యాయస్థానాలు కలుగజేసుకొని తీర్పులివ్వాల్సిన దుస్థితి. పండుటాకులను పట్టించుకోని నాగరికతా ఓ నాగరికతేనా!

★

ఈ సంచికలో....

టపా	...	2
నవ్వుల్ పువ్వుల్	...	5
ఆరోగ్యం	...	6
రుచి	...	7
సమ్‌థింగ్ స్పెషల్	...	8
సీరియల్	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
తెల్సా	...	17
కవిత్వమ్	...	18
క్రైమ్ కథ	...	19
కథ	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

'నవ మేధావి' మలచిన భావి



సినిమా కబుర్లు ... 3

'అభినయ'ం అభినందనీయం

రాఖీ ... 20

అనురాగాల నిండుపున్నమి



ర్యాగింగ్ సమస్యను చక్కగా చెప్పారు

జులై 12 ఆదివారం స్నేహలో కవర్‌స్టోరీగా ర్యాగింగ్ సమస్యను-పరిష్కారాన్ని చక్కగా తెలియజేశారు. అసభ్యకరంగా తోటి విద్యార్థులను బలవంతంగా చేయకూడని పనులు చేయించి బాధపెట్టే ఈ పైశాచిక మనస్తత్వం అంతం కావాలంటే ఒక పరిష్కారం వుంది. విద్యార్థులను చేర్చుకొనే ముందుగానే ర్యాగింగ్ చేసిన వారిని వెంటనే సస్పెండ్ చేస్తాం అన్న వార్నింగ్‌ను అప్లికేషన్ ఫాంలోనే వుంచాలి.

ఆచార్య నూతి నారాయణరావు,
హైదరాబాద్.

సీమ సమస్యల పుస్తక సమీక్ష బావుంది

ర్యాగింగ్ నేటి సామాజిక రుగ్మత, మరియు కొందరు ఆకతాయి విద్యార్థుల మారణకాండ. ఈ ర్యాగింగ్ భూతం ప్రపంచవ్యాప్తంగా ఉన్నా దక్షిణ భారతదేశంలో అందునా మన రాష్ట్రంలో అధికంగా వుంది. ర్యాగింగ్ అనే విషక్రీడలో ఎందరో ఆత్మహత్యలకు పాల్పడ్డారు, చనిపోయారు. కొందరు అంగవైకల్యం పొంది బాధపడుతున్నారు. ఈ ఏడాది నుండి చట్టం అమలులోకి వచ్చినప్పటికీ తగిన శిక్షలు లేవు. కళాశాలలు దీనిని ప్రైవేటు చట్టంగా పరిగణించి బాధ్యతల నుండి తప్పుకుంటున్నాయి. 2007లో ర్యాగింగ్‌ను నిషేధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. సి.బి.ఐ మాజీ డైరెక్టర్ రాఘవన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలి. 'కొత్త పుస్తకాలు' శీర్షికలో సీమ సమస్యలపై పుస్తకాల పరిచయం బాగుంది.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖపట్నం.

కుంకుమ కబుర్లు ఖరీదైనవే

అరటి బజ్జీలు, ఉల్లిపకోడి, చిప్స్, దద్దోజనం ఎంత రుచిగా ఉంటుందంటే మాటల్లో చెప్పలేము. ప్రతి ఆంధ్రుడికి ఈ రుచులు సుపరిచితమే. బుద్ధిగా చదవండి అని తల్లిదండ్రులు పిల్లలను కాలేజీలకు పంపిస్తే జుట్లు పెంచుకుని, ఏనుగుల్లా బలిసి, ఆడమగా తేడా తెలియకుండా ర్యాగింగ్ చేస్తూ అటు తల్లిదండ్రులకు, ఇటు కాలేజీలకు చెడ్డపేరు తెస్తూ అప్రతిష్ఠపాలు చేస్తున్నారు. ఇటువంటి వారికి కఠిన శిక్షలు విధించాలి. అహ్మదాబాదు అందాలు పట్టుకొచ్చి మాకు కనువిందు చేసి ఎన్నోవిషయాలు తెలియజేశారు. కుంకుమ కబుర్లు ఖరీదైనా బాగున్నాయి.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్,
నెల్లూరు.

అహ్మదాబాద్ విశేషాలు బావున్నాయ్

జులై 19 నాటి స్నేహ సంచికలో 'ర్యాగింగ్' గురించిన అట్టమీది కథ వర్ధమాన పరిస్థితుల్ని ప్రతిబింబించింది. ర్యాగింగ్ చేసినవారి పట్ల కఠినచర్యలు ఖచ్చితంగా పాటిస్తేనే మార్పు వస్తుంది. కరాటేలో కరా అంటే ఖాళీ అనీ, టె అంటే చేతులని వివరించిన తెల్సా శీర్షిక ఆకర్షణీయంగా వుంది. సమ్‌థింగ్ స్పెషల్‌లో కుంకుమ పువ్వు పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకున్నాం. విజ్ఞాన వీచిక సంభాషణ రూపంలో ఉంటూ కొత్తరకంగా ఆకట్టుకుంటోంది. గని సీరియల్ ఆసక్తికరంగా కొనసాగుతోంది. చూద్దామా లో అహ్మదాబాద్ విశేషాలు బావున్నాయి. అయితే కచ్ భూకంపం వల్ల సిద్దిబషీర్ మినార్లు సైతం దెబ్బతినడం బాధాకరమే. మనలోమాట కందిపప్పును వైఎస్ నే అడగమనడం సంగతేమోకానీ అసలు తపస్సు చేయడం వృధా. వైఎస్ వద్ద చెక్క భజనో, ధర్నానో చేసుకోమనడమే బెటర్.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

కవితలు సూపర్

జులై 19 ఆదివారం స్నేహలోని 'అమ్మను అడగాలని వుంది', 'శ్రీశ్రీ కవితలు చాలా బావున్నాయి. చదువుకుంటారని కాలేజీలకు పంపితే కొందరు విద్యార్థులు చేసే అల్లరిచిల్లరి పనులకు ర్యాగింగ్ పేరుపెట్టి మరికొందరి జీవితాలతోనే ఆడుకుంటున్నారన్న సంగతిని ఎప్పటికి తెలుసుకుంటారో అర్థం కావడంలేదు. కొత్తగా వచ్చిన తోటి విద్యార్థుల భయం, బిడియం పోగొట్టడానికి సరదాగా పెట్టిన ఈ పద్ధతి రూపు మార్చి ప్రాణాలతోనే చెలగాటమాడుతున్నారు. ఒకసారి ర్యాగింగ్‌కు గురైన వారైనా తరువాతి సంవత్సరం తమ జూనియర్లను అలా ఇబ్బంది పెట్టకుండా వుంటే బావుంటుంది. కుంకుమ పువ్వు కబుర్లు కలర్‌ఫుల్‌గా బాగున్నాయి.

సాంబశివరావు,
కమలానగర్, ఆదిలాబాద్.



పుస్సీ నచ్చేసింది

ఈవారం చూద్దామా చదివిన తర్వాత అహ్మదాబాద్‌లో చూడాల్సిన ప్రదేశాలు ఎన్ని ఉన్నాయో అనిపించింది. జోక్స్ బాగున్నాయి. విజ్ఞాన వీచిక సంభాషణ రూపంలో ఇవ్వడం కొత్తగా వున్నా బాగుంది. పుస్సీ కథ బాగా నచ్చింది. గని సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. కుంకుమ పువ్వు గురించిన చాలా వివరాలు తెలుసుకున్నాం.

ఎం. సుగుణ, సికింద్రాబాద్.

★



సినిమా కబుర్లు

'అభినయ'ం అభినందనీయం

తమిళ చిత్రం 'నాదోడిగళ్' కథ ముగ్గురు స్నేహితుల చుట్టూ తిరుగుతుంది. ఆ ముగ్గురు మిత్రులే శశికుమార్, విజయ్ వసంత్, భరణి. ముగ్గురు హీరోలుంటే ముగ్గురు హీరోయిన్లు వుండడం సహజమే కదా. ఈ ముగ్గురు కథానాయికలలో ఒకరైన అభినయ మాట్లాడలేదు. వినలేదు. మనం ముందే చెప్పుకున్నట్టు సినిమాలో మాత్రం డైలాగ్ చెప్తుంది. ఎలాగంటారా! డబ్బింగ్ ఆర్టిస్టు సహాయంతో. అయితే డైలాగ్‌కు అనుగుణంగా పెదాలు కదిలించడం అంత చిన్న విషయం కాదు! అదీ అభినయకు. మామూలుగా అయితే మూగచెవిటి వారికి మనం చెప్పేది వినపడదు. అర్థంకాదు. కానీ అభినయ తన తల్లిదండ్రుల సాయంతో చక్కగా డైలాగ్ అర్థం చేసుకొని మాట్లాడినట్టు పెదాలు కదిలించింది. పదిహేడేళ్ల ఈ చెన్నై పిల్ల ఇలా తన అందంతో, నటనతో తొలి చిత్రంలోనే ప్రేక్షకుల నాడి పట్టేసింది.

నటనకు భాష అడ్డు కాదని చెప్పేందుకే....

అసలు ఒక మూగ చెవిటి అమ్మాయిని ఒక హీరోయిన్‌గా. ... అదీ తొలిసారి తీసుకోవడమంటే మాటలా! దాని వెనక కూడా ఒక కథ వుంది. తమిళ దర్శకుడు సముతిరక్కని తను తీయబోయే చిత్రం కోసం ఓ పెద్ద హీరోయిన్‌ని కలిశాడు. ఆమె ఇతని చిత్రంలో చెయ్యడం ఇష్టం లేదంది. దానికి ఓ కారణం కూడా చెప్పిందంట. అది దర్శకుడిని ఒక క్షణంలో బాధపెట్టినా... పట్టుదల పెంచింది. ఆ పట్టుదల లోంచి పుట్టినదే 'నాదోడిగళ్' చిత్రం. ఇంతకీ ఆ నటి ఏమందో చెప్పలేదు కదూ. 'నాకు ఇంగ్లీషు తెలియని డైరెక్టర్‌తో పని చేయడం కష్టం' అని. అంతే... నటనకు భాష ఆటంకం కాదని చెప్పదలచుకున్నాడు దర్శకుడు. ఆ మధనంలోంచి పుట్టినదే నాదోడిగల్. ఆ కసిలోంచి వచ్చిన ఆలోచనే మూగ, చెవిటి అమ్మాయిని హీరోయిన్‌గా ఎంపిక చేయడం.

సహ నటులకు స్ఫూర్తినిచ్చిన 'అభినయ'ం

అభినయ పట్టుదల ముందు ఆమె వైకల్యం ఓడిపోయిందనే చెప్పాలి. ఎంతో పట్టుదలతో, శ్రద్ధతో, కృషితో కష్టపడి నటించింది. ఆమెలోని ఈ సుగుణాలను సహ నటీనటులతోపాటు దర్శకుడు కూడా అభినందించకుండా వుండలేకపోయారు. 'అభినయ బహుముఖ ప్రతిభాశాలి. ఆమెతో నటించినందుకు చాలా సంతోషంగా వుంది' అని సహ నటి అనన్య కితాబిచ్చింది. దర్శకుడైతే 'నటనలో ఆమె చూపిన చొరవ చూసి ఆశ్చర్యపోయాను. చిత్రంలోని సన్నివేశాలన్నీ దాదాపు మొదటిసారికే ఓకే అయ్యాయి. తను చాలా తెలివిగల అమ్మాయి. మనకు కావాల్సిన దాన్ని ఇట్టే పసిగట్టి చేసేసేది. తనకు విషయాన్ని వివరించడంలో ఎటువంటి కష్టం ఎదురుకాలేదు. అందుకు ఆమె తల్లి మాకు బాగా సాయం చేసింది. తన వైకల్యాన్ని అధిగమించి చక్కగా నటించింది' అంటూ అభినందించాడు. మొత్తంమీద ఇటు తోటి నటుల నుంచి, దర్శకుడి నుంచేకాక ప్రేక్షకుల నుంచి కూడా నూటికి నూరు శాతం మార్కులు కొట్టేయడమంటే చిన్న విషయం కాదు కదా.

పెదాల కదలికను ఇట్టే పసిగడుతుంది

పదిహేడేళ్ల అభినయ స్వస్థలం చెన్నై. తల్లి పార్వతి ఆమె వెంటే వుంటుంది. "మూడేళ్ల వయసులోనే ఎదుటివాళ్ల పెదాల కదలికను బట్టి వారు చెప్పే విషయాన్ని అర్థం చేసుకునేది. టీవీలో వచ్చే డాన్స్ ప్రోగ్రాములను చక్కగా పరిశీలించేది" అంటారు పార్వతి.

మూడు భాషల్లో...

విజయవంతంగా ఆడుతోన్న 'నాదోడిగళ్' చిత్రాన్ని ఇప్పుడు మరో మూడు భాషల్లో రీమేక్ చేయనున్నారు. వాటికి కూడా సముతిరక్కనే దర్శకత్వం వహించనున్నాడు. ప్రధాన పాత్రను తెలుగులో రవితేజ, హిందీలో స్లమ్ డాగ్ మిలియనీర్ నటుడు దేవ్ పాటిల్, కన్నడలో పునీత్ రాజ్‌కుమార్ చేయనున్నారు. త్వరలో చిత్రీకరణ కూడా ప్రారంభం కానుంది. ★

అదో తమిళ చిత్రం. పేరు 'నాదోడిగళ్'. గ్లోబల్ ఇంటర్నేషనల్ బ్యానర్‌మీద రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఇటీవలే తమిళనాట విడుదలైంది. రాష్ట్రం మొత్తంమీద 126 కేంద్రాలలో విజయవంతంగా నడుస్తోంది. వంద రోజులు పూర్తయ్యేలోగా 30 కోట్ల రూపాయలు వసూలు చేస్తుందని సినీ పండితుల అంచనా. అంటే...నటీనటులు సూపర్‌గా చేశారనేకదా అర్థం. ప్రేక్షకులది కూడా ఇదే మాట. ముఖ్యంగా చిత్రంలోని ముగ్గురు హీరోయిన్లలో ఒకరైన పవిత్ర పాత్ర చేసిన 'అభినయ' అభినయం అదరహో అంటున్నారు. అయితే...ఇక్కడే ఒక ట్విస్ట్ వుంది. తన అమాయకపు చూపులతో, అందంతో, అభినయంతో ఇట్టే ఆకట్టుకునే అభినయ నిజ జీవితంలో మాట్లాడలేదు. వినలేదు. తను పుట్టు మూగ... చెవిటి (కానీ 'వాలి' చిత్రంలో అజిత్‌లాగా ఎదుటివారి పెదాల కదలికను బట్టి అన్నీ అర్థం చేసుకుంటుందండోయ్!). అయితే చిత్రంలో మాత్రం తను మూగ చెవిటి అమ్మాయి కాదు. చక్కగా మామూలుగా మనలాగా మాట్లాడగలిగే పాత్రలో జీవించింది. చక్కటి లిప్ మూమెంట్, టైమ్లీ డైలాగ్‌తో(డబ్బింగే అనుకోండి) అదరగొట్టేసింది. ఈ సంగతి పత్రికలలో చదివిన వారు నమ్మలేకపోయారంటే నమ్మండి. ఆమె నటన చూసి మూగబోయారనుకోండి. ఈ వారం సినిమా కబుర్లు అవే మరి. చదివేయండి చకచకా.

-నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్,
కాలమిస్టు

'నవ మేధావి' మలచిన భావి

చాలా పుస్తకాలు చదివినా, ఎక్కువ స్ఫూర్తి, ప్రభావం కల్గించిన పుస్తకం ఏదంటే గొర్రెపాటి వెంకట సుబ్బయ్య రాసిన 'నవమేధావి నార్ల' అనే చెప్పాలి. దీనినెలా నిర్ణయించాలి? తెలుగుమీద ప్రేమ, లేఖనం పట్ల గౌరవం, జర్నలిజం పట్ల మోజు ఈ పుస్తకం ద్వారా పెరిగాయని చెప్పాలి. ఒక రకంగా దిశా నిర్దేశం అని చెప్పుకోవాలి. వీటికీ తర్వాత నా రచనలకూ, నేను చేసిన ఉద్యోగాలకు సంబంధం ఉందని ఒప్పుకోవాలి. మరీ ముఖ్యంగా వ్యాసాన్ని ఆసక్తికరంగా ప్రారంభించి, అర్థవంతంగా కొనసాగించి, తృప్తికరంగా ముగించడమనే శైలి అలవర్చుకోవడం వెనుక బహుశా తర్వాత తర్వాత నేను చదివిన నార్ల రచనల ప్రభావం తప్పక ఉండి ఉంటుంది.



స్ఫూర్తి కలిగించిన పుస్తకం గురించి చెప్పడమంటే బాల్యంలోకి తొంగి చూసుకోవడమే! బుద్ధి వికసిస్తున్నప్పుడు దేశంలో ఒక కీలక ఘట్టం నడిచింది. అదే అత్యయిక పరిస్థితి. తొమ్మిదవ తరగతి ముగుస్తున్న సమయంలో ఎమర్జెన్సీ ఎత్తివేసి ఎన్నికలు ప్రకటించడం, ఇందిరాగాంధీ ఓడిపోవడం బాగా గుర్తు. అంతకుముందు ఆంధ్ర సచిత్ర వారపత్రికలో కార్టూన్లు లేకుండా కేవలం ఖాళీ స్థలం ఉండడం ఎందుకో అర్థం కాలేదు. తర్వాత తెల్సింది అది ఎమర్జెన్సీ మహత్యమని, సెన్సారింగ్‌కు నిరసనగా ఖాళీ వదిలేశారని. 1977-78 సంవత్సరం అంటే పదవ తరగతి ప్రవేశం అనేది సంచలన వార్తల సందోహం మధ్య నడిచింది. నిజానికి మా వూరు కొనతట్టుపల్లి. అంత పెద్ద వూరు కాదు. అందువల్ల అన్నలకు సహాయకారిగా ఉంటూ హైస్కూల్ చదువు సాగింది హిందూపురంలో. ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. 1978 ఫిబ్రవరి 10న ఓ దినపత్రిక లో నా కవిత ఒకటి ఉత్తరంగా సంపాదకీయ పుటలో ప్రచురించారు. ప్రాథమిక పాఠశాల చదువు కొనతట్టుపల్లిలో సాగేకాలంలో ఆంధ్రసచిత్ర వార పత్రికను మా అన్నలు రెగ్యులర్‌గా కొనేవారు. అందువల్ల పత్రిక మొత్తం చదవడం అలవాటయ్యింది. బాగా కుగ్రామం కనుక దినపత్రిక వచ్చేది కాదు. వార పత్రికను హిందూపురంలో కొనేవారు. 1977 ఎన్నికల తర్వాత మే నెలలో నార్ల వెంకటేశ్వరరావు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో 'లోకం పోకడ' అనే శీర్షికలో కొన్ని నెలల పాటు వ్యాసాలు రాశారు. నిజానికి ఈ పత్రిక పాత సంచికలు తర్వాత దొరికితే కొన్ని చదివి, తర్వాత మిగతా సంచికలు మిత్రుల దగ్గర సేకరించాను. దాదాపు 16 వ్యాసాలు దొరికాయి. అందులో చాలాభాగం ఎమర్జెన్సీ, నియంతలు, స్వేచ్ఛ వంటి విషయాల ఆధారంగా సాగాయి. అప్పటికి ఆయన గురించి తెలియదు. కానీ ఆంధ్రజ్యోతి వార పత్రికలో ఆయన సంపాదకులని గుర్తించాను (ఎందుకంటే ఆ కాలంలో ఆంధ్రజ్యోతి దినపత్రిక మా ప్రాంతంలో లభ్యమయ్యేది కాదు). వాదన, శైలి, తీవ్రత, భాష భలేగా ఉందనిపించేది. నిజానికి అప్పటికే జర్నలిజం మీద మొగ్గు అంతర్గతంగా ఉందేమో!

పదవ తరగతి చదివాక హిందూపురంలోనే ఎస్.డి.జి.ఎస్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఎం.పి.సి గ్రూప్‌లో చేరాను. నిజానికి నా చదువుకు సంబంధించి అంటే పాఠ్యేతర పుస్తకాల పఠనానికి నా స్వర్ణయుగం ఇక్కడే ప్రారంభమైందని చెప్పుకోవాలి.

స్ఫూర్తి కల్గించిన పుస్తకం అనగానే అప్పట్లో చదివిన పుస్తకాలు లీలగా గుర్తుకు వచ్చాయి. ఆ సమయంలో రాసుకున్న నోట్‌పుస్తకాలు తిరగేయడం ఆనందం కలిగించింది. ఎమ్మెస్సీ దాకా అలా ప్రత్యేకంగా ఆరేడు నోటు పుస్తకాలున్నాయి. ఇప్పటికీ అవి భద్రంగా ఉన్నాయి. వివేకానంద జీవిత చరిత్ర, వేమన పద్యాలు, వీరేశలింగం స్వీయ చరిత్ర, శరత్ జీవితం, శ్రీశ్రీ ఖడ్గసృష్టి, నవ మేధావి నార్ల, రవీంద్రుని గీతాంజలి, ఆరుద్ర త్వమేవాహం, నార్లవారి మాట, చిలకమర్తి స్వీయచరిత్ర, శ్రీశ్రీ మహాప్రస్థానం, ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవల, ఎం.ఎన్ రాయ్ న్యాయాన్యాయాలు వంటి పుస్తకాలు చదివినట్టు నోట్ బుక్ చెపుతుంది. ఒకవైపు ప్రతిరోజూ హిందూ దిన పత్రికను (ముందురోజు సంచికను) దాదాపు మొత్తంగా చదివే మొండి ప్రయత్నం కూడా ఆ రోజుల్లో చేశాను. ఇంటర్ మొదటి సంవత్సరం సెలవుల్లో విశ్వనాథ వారి వేయిపడగలు మొత్తం చదివాను. కానీ చాలా చోట్ల భాష మింగుడు పడేది కాదు. అయినా ప్రయత్నం సాగేది. దాదాపు అదే సమయంలో సత్య సాయిబాబా మీద డా॥ తంబు రాసిన విమర్శపై ఆంధ్రజ్యోతి వారపత్రికలో సుమారు ఆరునెలలపాటు చాలా లోతుగా చర్చ సాగింది. సరిగ్గా అదే సమయంలో 'విశాలాంధ్ర' పాత సంచికల్లో డా॥ హెచ్. నరసింహయ్య (నాస్తికుడు, గాంధేయవాది, మాజీ వైస్ ఛాన్సలర్) గురించి తెలుసుకున్నాను. ఆయన అనంతపురం సరిహద్దు ప్రాంతపు వ్యక్తి. ఆయన జీవిత వివరాలు, కృషి, స్ఫూర్తి కలిగించాయి. ఇలా చాలా చాలా పుస్తకాలు గుర్తుకువచ్చాయి.

తరగతిలో చాలా మంది విద్యార్థులుంటారు. కానీ అందరూ ఒకేలా స్పందించకపోవచ్చు. దానికి కారణం కేవలం పాఠం మాత్రమే కాక, విద్యార్థి అందుకోవడం మీద కూడా అది ఆధారపడి ఉంటుంది. అలాగే పుస్తకాల ప్రభావం అనేది కేవలం పుస్తకాల మీదనే కాక, దానిని చదివే పాఠకుల స్థాయి, అభిరుచి, చదివిన సందర్భం మీద కూడా ఆధారపడి ఉండొచ్చు. చాలా పుస్తకాలు చదివినా, ఎక్కువ స్ఫూర్తి, ప్రభావం కల్గించిన పుస్తకం ఏదంటే గొర్రెపాటి వెంకట సుబ్బయ్య రాసిన 'నవమేధావి నార్ల' అనే చెప్పాలి. దీనినెలా నిర్ణయించాలి? తెలుగుమీద ప్రేమ, లేఖనం పట్ల గౌరవం, జర్నలిజం

పట్ల మోజు ఈ పుస్తకం ద్వారా పెరిగాయని చెప్పాలి. ఒక రకంగా దిశా నిర్దేశం అని చెప్పుకోవాలి. వీటికీ తర్వాత నా రచనలకూ, నేను చేసిన ఉద్యోగాలకు సంబంధం ఉందని ఒప్పుకోవాలి. మరీ ముఖ్యంగా వ్యాసాన్ని ఆసక్తికరంగా ప్రారంభించి, అర్థవంతంగా కొనసాగించి, తృప్తికరంగా ముగించడమనే శైలి అలవర్చుకోవడం వెనుక బహుశా తర్వాత తర్వాత నేను చదివిన నార్ల రచనల ప్రభావం తప్పక ఉండి ఉంటుంది.

ఈ వ్యాసం రాయాలనుకున్నప్పుడు మరలా ఆ పుస్తకం చదవాలనిపించింది. దాదాపు నాలుగైదు నెలలు శ్రమిస్తే చివరికి 1979లో ఏ పుస్తక ప్రతినైతే చదివానో, అదే ప్రతిని సరిగ్గా మూడు దశాబ్దాల తర్వాత ఇప్పుడు చదవగలిగాను. అయితే పుస్తకం అట్ట పోయింది. అందువల్ల లోపలి పేజీతోనే సంతోషపడాలి. ఈ పుస్తకం చదివినప్పుడు 1969 జులై 21న చంద్ర మండలంపై దిగి, 'మానవ విజయం' సాధించిన విషయంపైన రాసిన సంపాదకీయం, అలాగే శక్తిని ఆధునిక దృష్టితో ఎలా వాడాలో రాసిన సంపాదకీయం, అంబేద్కర్ మౌలిక చింతన అనే వివరమైన పుస్తక సమీక్ష యథాతథంగా నా నోట్ పుస్తకంలో రాసుకున్నాను.

1985లో నార్ల చనిపోయినప్పుడు నేను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చదువుకొంటున్నాను. ఆ వార్త తెలిసిన రోజున ఒక వ్యాసం రాశాను. అది 'నార్ల బాట' పుస్తకంలో తొలివ్యాసమైంది. మరలా 2001 ప్రాంతంలో 'నవమేధావి నార్ల' పుస్తకం చదవాలనిపించింది. చలసాని ప్రసాద్(విశాఖపట్నం) నుంచి తుమ్మల వేణుగోపాలరావు ద్వారా తెప్పించుకున్నాను. ఆ ప్రతి నాదగ్గర మూడు సంవత్సరాలు ఉంది. ఆ సమయంలోనే 'నవతరానికి నార్ల' అనే శీర్షికలో 13 వ్యాసాలు రాశాను. తర్వాత ఆ వ్యాసాలు 2007లో పుస్తకంగా వచ్చాయి.

నవమేధావి నార్ల పుస్తకంలో రచయిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య శైలి ప్రత్యేకంగా వుంటుంది. ఆయన రాయడం కన్నా ఆ పుస్తక కథానాయకుడి చేతనే (నార్ల ఇదివరకు అక్కడక్కడ రాసిన రచనల నుంచి) పలికిస్తారు. అందువల్ల ఈ పుస్తకంలో నార్లవారి రచనలే మూడువంతులు ఆక్రమిస్తాయి. పలుకుబడులు - నుడికారాలు, మడులు - దడులు, సందేహాలు - ప్రశ్నలు, ఈనాడు ఏమికావాలి?, ఆంధ్రుల శిల్ప సంపద వంటి సంపాదకీయాలు అలాగే రామ మోహనరాయ్, కాశీనాధుని, సురవరం, శారదాదేవి, కోటంరాజు, అన్నమాచార్య, చెలుపెలు, కస్తూరి శ్రీనివాస్, ఘంటసాల, అమీర్ ఖుస్రో, గాంధీ, వివేకానంద ఇలా వ్యక్తుల మీద రాసిన పద చిత్ర సంపాదకీయాలు చాలాసార్లు చదువుకున్నాను.

వార్తా పత్రిక విస్తృతి అనేది సమాజపు విస్తృతి మీద ఆధారపడి వుంటుంది. అంత వైవిధ్యంగా దృష్టి సాగాలనీ, దానికి అధ్యయనం కావాలనీ, అంతకుమించి ఆ రచన హాయిగా అర్థవంతంగా నడవాలనీ 'నవమేధావి నార్ల' పుస్తకం నాకు స్ఫూర్తి కలిగించింది. ★

అంత వైవిధ్యంగా దృష్టి సాగాలనీ, దానికి అధ్యయనం కావాలనీ, అంతకుమించి ఆ రచన హాయిగా అర్థవంతంగా నడవాలనీ 'నవమేధావి నార్ల' పుస్తకం నాకు స్ఫూర్తి కలిగించింది.

నవ్వుల్ - పువ్వుల్

ఫోన్ నెంబర్

రాజేంద్ర: శ్యామ్! నీ ఫోను నెంబరివ్వరా?

శ్యామ్: అది మా నాన్న పేరుతో వుంటుంది. డైరెక్టరీలో చూడు.

రాజేంద్ర: మీ నాన్న పేరు చెప్పరా!

శ్యామ్: అదికూడా డైరెక్టరీలోనే వుందిరా చూడు.

పళ్లు - గోళ్లు

తండ్రి: డాక్టర్! మా అబ్బాయి పొద్దస్తమానం గోళ్లు కొరుకుతున్నాడు. మీరు ఎలాగైనా వాడి అలవాటు మార్చాలి.

డాక్టర్: ఓకే. అదెంత పని! పళ్లన్నీ పీకేస్తే సరి.



క్యాలెండర్

మోహన్: (షాపువానితో) నాకు క్యాలెండర్ కావాలండీ.

షాపు యజమాని: నీకు ఎలాంటి బొమ్మలున్నది కావాలి?

మోహన్: నాకు బొమ్మలంటే ఇష్టంలేదు. ఏ క్యాలెండర్‌లో అయితే ఎక్కువ సెలవులుంటాయో అది ఇవ్వండి.

రావణుడి సమస్య

టీచర్: రామూ! రావణుడికి అతి పెద్ద సమస్య ఏంటి?

రాము: తన పది తలల్లో ఏ తలకు తలనొప్పి వచ్చిందో కనుక్కోవడం టీచర్.

జోక్స్ పంపాల్సిన మా చిరునామా : **నవ్వుల్ పువ్వుల్ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.**

ఆరోగ్యం

బిడ్డకు తల్లిపాలే మంచివి



తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన వరం. మహిళల జీవితంలో "గర్భధారణ- కాన్పు- బిడ్డలకు పాలుపట్టటం' అనేవి వారు నిర్వహించే ప్రాకృతిక ధర్మాలలో కొన్నిదశలు. "గర్భధారణ-కాన్పు" నుండి పాలు పట్టటాన్ని వేరు చేయలేము. సృష్టి ఆవిర్భవించినప్పటి నుండి మన అమ్మలు, అమ్మమ్మలు, వారి అమ్మలు విజయవంతంగా పిల్లలకు పాలు పట్టారు. స్తనాలను ఇంగ్లీషులో మ్యామరీగ్లాండ్స్ అని శాస్త్రీయంగా అంటారు. దీని నుండి క్షీర జంతువులకు మ్యామల్స్ అనే పేరు వచ్చింది. అంటే మనకాపేరు వచ్చింది కూడా తల్లిపాల సంస్కృతి నుండే. మనం కాకుండా దాదాపు 4236 ఇతర క్షీర జంతువులు ఏ ఆలోచన లేకుండా, ఎలాంటి సమస్యలు లేకుండా ఇప్పటికీ బిడ్డలను పాలిచ్చి పెంచుతున్నాయి.

- డా॥ ఆరవీటి రామయోగయ్య

చిన్నారి పుట్టినప్పటి నుండి తనతో మాట్లాడాలని, తనను తాకాలని, తనను ఆడించాలని మనందరినుంచి కోరుకుంటుంది. తల్లి బిడ్డకు కేవలం పాలే పట్టదు. అమ్మ బిడ్డను స్పృసిస్తుంది. బిడ్డతో మాట్లాడుతుంది. బిడ్డలో మార్పులు గమనిస్తుంది. బిడ్డ అమ్మను గమనిస్తుంది. అమ్మ ఒడి వెచ్చదనం అనుభవిస్తుంది. అదెంతో భద్రతా భావాన్నిస్తుంది. వారిద్దరి మధ్య ఎన్నో ఊసులు, ఎంతో శారీరక భాష ఇవ్వటమూ తీసుకోవడమూ జరుగుతుంది. ఇద్దరికీ అదొక అవ్యక్తానుభూతినిస్తుంది. ఇదంతా శిశు ఆరోగ్యానికీ, శారీరక మానసికాభివద్ధికి, అమ్మ ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తుంది. పోతపాలు పట్టటం వల్ల తల్లికి బిడ్డకు ఈ అనుభూతులేవీ అందవు.

తల్లిపాలే ఎందుకు?

- ♦ చిన్నపిల్లలకు ఆరునెలల వయస్సు వరకు కేవలం తల్లిపాలే అన్ని ఆహార అవసరాలు తీరుస్తుంది. తల్లిపాలకు ప్రత్యామ్నాయం లేదు.
- ♦ చిన్నపిల్లలకు తల్లిపాలు మొదటి వ్యాధినిరోధక టీకా. తల్లిపాల వల్ల ప్రాంణాంతక వ్యాధుల నుండి చిన్నపిల్లలను రక్షించవచ్చు.
- ♦ ప్రత్యక్షంగా, పరోక్షంగా కుటుంబాలకు, దేశానికి, ఆర్థికంగా ఉపయోగకరం. వ్యాధులకు ఖర్చుపెట్టే ఎంతో డబ్బు ఆదా అవుతుంది.
- ♦ పోతపాలు తయారు చేయడానికి, పాల సీసాలు స్టెరిలయిజు చేయడానికి వాడే విద్యుచ్ఛక్తి, ఇంధనం వల్ల పరిసరాల సమతుల్యం దెబ్బతింటుంది. తల్లిపాల వాడకం వల్ల పరిసరాల సమతుల్యాన్ని కాపాడవచ్చు.
- ♦ తల్లిపాలను సరైన ఉష్ణోగ్రతలో చిన్నారులకు ఎక్కడపడితే అక్కడ పట్టవచ్చు. ఎన్నో పని గంటలు కూడా కాపాడవచ్చు.
- ♦ తల్లిపాల వాడకం అమ్మలో గర్భధారణను వాయిదా వేస్తుంది. ఇదో రకం కుటుంబ నియంత్రణ చర్యకూడా!
- ♦ కాన్పు అయిన తర్వాత సాధారణంగా జరిగే రక్తస్రావం పాలు పట్టే తల్లులలో ఆగిపోతుంది.
- ♦ తల్లులలో రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ తక్కువ. ఆస్టియోపోరోసిస్ అనే వ్యాధికూడా తక్కువగా వస్తుంది.
- ♦ తల్లిపాలు తాగేపిల్లలలో తెలివితేటలు ఎక్కువని, నేర ప్రవృత్తి తక్కువని ఎన్నో పరిశోధనలలో తేలింది.

తల్లిపాలు - కొన్ని సత్యాలు

- ❒ నిజంగా ప్రతి తల్లి బిడ్డకు తన పాలు పట్టగలదు."పాలు లేవు, పాలు తక్కువ" అనే అంశాలు లేవు. "బిడ్డలకు తల్లిపాలు పట్టటం అనేది సామాజిక వాతావరణాన్ని బట్టే ఉంటుందికానీ, తల్లి శారీరక పరిస్థితిపై కాదు".
- ❒ తల్లిలో ఆహార లోపానికి, తల్లిపాల నాణ్యతకు ఎలాంటి సంబంధంలేదు.
- ❒ స్తనాల సైజుకు, తల్లిపాల ఉత్పత్తికి ఎలాంటి సంబంధంలేదు.
- ❒ తల్లి బిడ్డలకు పాలు పడితే, తల్లి శారీరక అందం తగ్గిపోతుందనేది సరైన ఆలోచనగాదు. ఇది తల్లులపై ఇతరులు వేసే నింద మాత్రమే. తల్లులెవ్వరూ అలా భావించరు. పాలు పట్టే తల్లులలో శరీరంలోని కొవ్వు పదార్థం తగ్గి, మానసిక ఆనందం - తృప్తి పెరిగి, వారి అందం ఇనుమడిస్తుంది.

పాలసీసా- మారణాయుధం

పాలసీసాలతో పాలు పట్టాలంటే రక్షిత నీటి సరఫరా కావాలి. పాల సీసాలు బాగా స్టెరిలయిజు చేసే వసతులు కావాలి. వీటిని గురించి బాగా అర్థం చేసుకొని ఆచరించే విద్య కావాలి. పాలపొడులు కొనడానికి డబ్బు కావాలి. సాధారణంగా మనం వాడే నీరు అంత మంచిది కాదు. మన పాల సీసాలు కంపు కొడతాయి. మనకు దొరికే పాలు పల్చన. ఫలితంగా "విరేచనాలు -ఆహారలోపం -తగ్గిన వ్యాధి నిరోధకశక్తి -విరేచనాలు-మరణం" అనే విషవలయంలోకి మన పిల్లలు పోతున్నారు. అంతేగాకుండా న్యుమోనియా, ఆహారలోపం లాంటి చాలా వ్యాధులకు పిల్లలు గురవుతారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం తల్లిపాలు పట్టనందువల్ల ఏటా 10 లక్షల మంది పిల్లలు ప్రపంచవ్యాప్తంగా మరణిస్తున్నారు. అందుకే పాలసీసాను "పిల్లల పాలిట మారణాయుధం" అంటారు. బిడ్డ నోట్లో పాలసీసా పెట్టి చక్కగా పాలు పడుతున్నాననుకోవడం తప్పు.

మిగతాది 9వ పేజీలో...

రుచి

పెసల కూర

కావలసిన పదార్థాలు

పెసలు-ఒక కప్పు
పచ్చి మిర్చి-నాలుగు
ఉప్పు-తగినంత
అల్లం వెల్లుల్లి ముద్ద- ఒక స్పూన్
కొత్తిమీర తరుగు-అర కప్పు
ఉల్లిపాయ తరుగు-అర కప్పు
నూనె-అర కప్పు
జీలకర్ర -అర స్పూన్
ఆవాలు-అర స్పూన్
పసుపు-పావు స్పూన్

తయారు చేసే విధానం

పెసలను ప్రెషర్ ప్యాన్‌లో వుడికించి తీయాలి. చల్లారిన తరువాత తీసి మెత్తగా చిదుముకోవాలి. ఇందులో ఉప్పు కలిపి చిన్న వుండలుగా చేసుకోవాలి. ప్యాన్‌లో నూనె వేసి పోపు సామాను వేసి ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేగనివ్వాలి. పసుపు కలిపి రెడీగా పెట్టుకున్న వుండలను వేసి నూనెలో నిదానంగా మగ్గనివ్వాలి. ఇందులో అల్లం వెల్లుల్లి ముద్దను వేసి వేగనివ్వాలి. వేగాక కొత్తిమీర చల్లి దించుకోవాలి. ఇది అన్నంలోకి రుచిగా వుంటుంది.

టమోటా కార్న్ గ్రేవీ

కావలసిన పదార్థాలు

టమోటాలు-ఎనిమిది పెద్దవి
కార్న్ ఫ్లోర్- రెండు స్పూన్లు
బఠాణీలు - ఒక కప్పు
ఉల్లిపాయ తరుగు-అర కప్పు
అల్లం, వెల్లుల్లి ముద్ద-ఒక స్పూన్
కొత్తిమీర -పావు కప్పు
పెరుగు -ఒక కప్పు
నూనె-సరిపడినంత
కారం-రెండుస్పూన్లు
ఉప్పు-తగినంత
మసాలా పొడి-అరస్పూన్

తయారు చేసే విధానం

టమోటాలను తీసుకుని వేడినీటిలో వేయాలి. ఇలా ఐదు నిమిషాలు వుంచి తీసి వేయాలి. పై పొట్టు వచ్చేస్తుంది. అయితే మరీ మెత్తగా కాకుండా చూడాలి. వీటిని నాలుగు భాగాలుగా కత్తిరించుకోలి. ప్యాన్‌లో నూనె వేసి ఉల్లి తరుగు వేసి వేయించాలి. తర్వాత అల్లం వెల్లుల్లి ముద్ద వేయాలి. కారం ఉప్పు వేసి కలిపి ఉడికిన బఠాణీలు కూడా వేయాలి. బాగా వేగాక పెరుగు గిలక్కొట్టి వేయాలి. ఉడికిన తరువాత కార్న్‌ఫ్లోర్‌లో నీళ్లపోసి కలిపి పోయాలి. టమోటా ముక్కలను కూడా దీనిలో వేసి మూతపెట్టి కొద్దిసేపు ఉడకనివ్వాలి. చివరగా మసాలా పొడి చల్లి, కొత్తిమీర వేసి దించుకోవాలి. ఇది అన్నం, చపాతీల్లోకి బావుంటుంది.

క్యాలీఫ్లవర్.. నిలువ పచ్చడి

కావలసిన పదార్థాలు

క్యాలీఫ్లవర్ - అరకేజీ
చింతపండు-ఒకకప్పు
కారం -ముప్పావు కప్పు
నూనె- ఒకకప్పు
పోపుసామాను -రెండు స్పూన్లు
మెంతిపిండి పావుకప్పు
పసుపు- అర స్పూన్
వెల్లుల్లి రేకులు- పది

తయారు చేసే విధానం

ముందుగా క్యాలీఫ్లవర్‌ను చిన్న పువ్వులుగా తీసుకుని కడిగి తుడిచి తడిలేకుండా ఆరబెట్టుకోవాలి. వీటిని నూనెలో వేయించి తీయాలి. చింతపండును చిక్కగా రసం తీసి దగ్గరకి ముద్దగా ఉడికించుకోవాలి. ఒక బేసిన్‌లో పోపు సామాను, నూనె వెల్లుల్లి తప్ప మిగితావన్నీ వేసి బాగా కలపాలి. మెంతులను వేయించి పొడి చేసి వేయాలి. నూనె కాచి పోపు సామాను, వెల్లుల్లి రేకులు వేసి చల్లార్చి క్యాలీఫ్లవర్‌లను కలిపి, కలిపి వుంచుకున్న మిశ్రమంలో వేసి బాగా కలపి, ఒక సీసాలో తడిలేకుండా డబ్బాలో (ప్లాన్ డే) గానీ పెట్టుకుంటే కొద్దిరోజులు నిలువ వుంటుంది. ఇది అన్నంలోకి రుచిగా ఉంటుంది.

మైదా లడ్డూ

కావలసిన పదార్థాలు

మైదా-రెండు కప్పులు
పంచదార- అర కప్పు
పాలు- అర కప్పు
నెయ్యి-అర కప్పు

తయారు చేసే విధానం

ముందుగా మైదాను నేతిలో వేయించి పెట్టుకోవాలి. పంచదారను మిక్సీ చేసుకోవాలి. మైదాను పంచదారపొడిని కలుపుకొని పాలతో తడుపుతూ లడ్డూలు చుట్టుకోవాలి. పిల్లలు ఇష్టంగా తింటారు.

- పి. జ్యోతి


మైదా లడ్డూ


టమోటా కార్న్ గ్రేవీ


పెసల కూర


క్యాలీఫ్లవర్.. నిలువ పచ్చడి



తాంబూలం అనే మాటకి ఎన్ని అర్థాలున్నా ప్రస్తుతానికి మాత్రం మనం తమలపాకు గురించే మాట్లాడుకుందాం.

కిళ్లీ, పాన్, బీడా... ఇలా ఎలా పిలిచినా పలికేది ఓ ఆకే. మనం చాలా రకాల ఆకుల్ని చాలా రకాలుగా వండుకుని గానీ, వంటల్లో మరో రూపంలో గానీ తింటాం. కానీ తమలపాకును మాత్రమే పచ్చిదాన్ని తినేస్తాం. నిజానికి దాన్ని తినడం అనకూడదు. ఎందుకంటే మనం చేసేది నమలడమే. చాలా వరకు రసం మింగేసి ఆకు పిప్పి వూసేస్తారు.

నోరు పండించే తాంబూలం

- యాజీవ్

ఏ ఆకైనా పచ్చిది - ఆ మాటకొస్తే ఉడికించిందైనా తినడానికి అంత రుచిగా వుండదు. ఇక తమలపాకు రుచి సంగతి అటుంచండి. అసలు ఆ వగరు, ఘాటు నాలుకకి తగిలితే తినేవాళ్లు ఎలా తింటున్నారబ్బా అనుకోవాలి. అసలు 'ఈ ఆకుని తినొచ్చు' అని ఎప్పుడు, ఎవరు కనిపెట్టారో తెలీదు గానీ, ఎప్పుడుబడితే అప్పుడు తినేవాళ్లు మాత్రం ప్రస్తుతం ఎక్కడబడితే అక్కడున్నారు.

ఆనాటినుంచే...

అయితే ఇలా 'పాన్' నమలడం అతి ప్రాచీన కాలం నుండీ వున్నట్టు ఆధారాలున్నాయి. ఇక మన పురాణాలూ, ప్రబంధాలూ, కావ్యాల్లో అయితే దాని ప్రస్తావన విస్తారంగానే వుంది.

ఆనాటి తాంబూల సేవన ఉద్దేశాలు వేరైనప్పటికీ ఇప్పటి పాన్ మాత్రం నోటిని శుభ్ర(?) పరచడానికి మొదలుకొని ఒక విధమైన సాంప్రదాయంగా మారిపోయింది. మృష్టాన్న విందుభోజనం తరువాత తాంబూలమివ్వడం ఈనాటికీ ఆచరించే సంప్రదాయం. ఇక శుభకార్యాలు తమలపాకులు, వక్కలు లేకుండా జరగనే జరగవు.

ఆ వంకతో...

విశేషమేమిటంటే, పాన్ పేరు చెప్పుకొని వక్క, పొగాకు(జర్దా), మీఠా వంటి ఎన్నో ఇతర పదార్థాలను తినడం పరిపాటైపోయింది. పూర్వం ఆకు, కాస్త సున్నం, కొద్దిగా వక్క వుంటే పక్కా తాంబూలమైపోయేది. ఇప్పుడలా కాదు. అతి ఖరీదైన సుగంధ ద్రవ్యాలు, దినుసులు ఒక పక్క వుంటే, అతి వ్యసన కారకాలైన పొగాకు వంటివీ పాన్ మడతల్లో ఇమిడిపోతున్నాయి.

పుట్టిల్లు

తమలపాకు భారతదేశం, శ్రీలంక దేశాల్లోనే పుట్టింది. ఇప్పటికీ అక్కడే 'సాగు'తోంది. బంగ్లాదేశ్ వంటి దేశాల్లోనూ దీని పెంపకం విస్తరించింది. కానీ ఈ ఆకుని 'నమిలే' అలవాటు మాత్రం చాలా ఆసియా దేశాల్లో వుంది. పైగా కొన్ని వేల సంవత్సరాల నుండీ ఇది కొనసాగుతోంది. దురదృష్టవశాత్తూ, ఆసియా వాసులు నివసించే ఇతర ప్రాంతాల్లో కూడా వారు నమిలి వూసిన కిళ్లీ 'మరకలు' దీని వ్యాప్తిని సూచిస్తాయి. దీని పర్యావసానాన్ని భరించలేక ఇటీవలే దుబాయ్ తమలపాకు దిగుమతి, అమ్మకాలను నిషేధించింది. మనకాభయం లేదనుకోండి. ప్రజాస్వామ్యపు స్వేచ్ఛ ఉచ్ఛస్థితిలో కనిపించేది ఇక్కడే. ఏ









ప్రదేశంలోనైనా వూయడంతో పాటు ఏదైనా విసర్జించగలగడంలోనే!

అంతా ప్రత్యేకమే

మనదేశంలో ప్రత్యేకించి ఉత్తర భారతంలో, తమలపాకు నమలడం జపాన్‌లో 'టీ' సంప్రదాయమంత పకడ్బందీగా వుంటుంది. పాన్‌కోసం ప్రత్యేక 'పాన్‌దాన్' (అందమైన నగిషీల డబ్బా – అందులో సుగంధ ద్రవ్యాలకోసం వేర్వేరు అరలు, వక్కల్ని చిన్న చిన్న ముక్కలు చేసేందుకు ప్రత్యేక పరికరం) తో పాటు నమిలిన తర్వాత వూయడానికి ఒక ప్రత్యేక ఉమ్మి గిన్నె ఉంటాయి. బనారస్‌లోని పాన్ చాలా విశేషమైందని అంటారు.

ఎన్ని సుగుణాలో!

తమలాపాకుకి చాలా ఔషధగుణాలున్నాయంటారు. దాన్ని తినడం వల్ల నోటి దుర్వాసన పోవడంతో పాటు జీర్ణప్రక్రియ సమర్ధవంతంగా జరుగుతుందనీ, పొట్టలో పురుగుల సమస్య తగ్గుతుందనీ, మనస్సును ఉత్తేజపరుస్తుందనీ, లైంగిక సామర్థ్యాన్ని పెంచుతుందనీ, కడుపునొప్పి, కీళ్లనొప్పులు తగ్గిస్తుందనీ అంటారు.

నిత్యం తమలపాకు సేవనంతో క్యాన్సర్ వస్తుందనీ అంటున్నారు. అయితే అందుకు కారణం కిళ్లీలో వాడే పొగాకు, వక్కలే గానీ ఆకు కాదు.

తమలపాకు మొక్క పాకుతుంది. కాబట్టి దీన్ని ఇతర చెట్లపైకి పాకిస్తుంటారు. దీనికి పూలు, కాయలు వుండవు. అసలు కేవలం ఆకుల కోసమే పెంచుతారు. నాటిన ఓ సంవత్సరం తరువాత ఆకులు తుంచడానికి అనువుగా వుంటాయి. ఆకుల్ని తొడిమతో సహా, కుడి చేత్తో మాత్రమే తుంచుతారు.

❖ తమలపాకును నాగవల్లి అనికూడా అంటారు.

❖ గొంతు నొప్పి, కడుపునొప్పి, శ్వాసకోశ వ్యాధుల నివారణలో దీనిని వాడతారు.

❖ ఆకుపై నూనె రాసి, వేడి చేసి కడుపుపై పెడితే కడుపునొప్పి తగ్గుతుందంటారు.

❖ దీని రసాన్ని చెవిలో పోస్తే నొప్పి తగ్గుతుందట.

ఇవీ తమలపాకు విశేషాలు. మీరు కూడా ఆ రుచి నచ్చితే తినండి. కొంతమందికి నోరు ఎర్రగా వుండడం ఇష్టం. కొందరికి అసహ్యం. నోరెంత పండితే అంత మంచిదనో, మంచి భర్త వస్తాడనో మరొకటనో అంటారు. అంతా వుత్తదే. తమలపాకులు చుట్టడం ఒక కళగా అభివృద్ధి చెందడమే కాదు, ఒక్కో కిళ్లీ వేలాది రూపాయలు పలుకుతోంది.

నోట్: మీ ఇష్టమొచ్చినంత కిళ్లీ తినండి. కానీ దయచేసి ఎక్కడబడితే అక్కడ వూసి గలీజు చేయకండి.

★

6వ పేజీ తరువాయి...

విజయవంతంగా చిన్నారులకు పాలు పట్టాలంటే...

☐ చిన్నారి పుట్టిన మొదటి అర్ధగంటలోపే పాలు పట్టడం మొదలుపెట్టాలి.

☐ ఆరు నెలల వయస్సు వరకు కేవలం తల్లిపాలే పట్టాలి. అంటే మండు వేసవిలో కూడా, నీరు కూడా తాపనక్కరలేదు.

☐ ఆరవ నెలలో ఇంటిలో తయారు చేసిన అదనపు ఆహారం మొదలు పెట్టాలి. అప్పుడే నీరు తాపడం కూడా మొదలు పెట్టాలి.

☐ రెండు సంవత్సరాలు, ఆపై వరకు అదనపు ఆహారంతో పాటు తల్లి పాలు పట్టాలి.

☐ రోజులో ఎక్కువ భాగం చిన్నారితో గడపాలి.

☐ చిన్నారికి ఎప్పుడు కావాలంటే అప్పుడు స్తనం అందివ్వవచ్చు. ఇందులో ఎలాంటి టైమింగ్స్ పాటించనక్కరలేదు.

☐ తల్లిపాలు పట్టే సమయంలో వైద్యుల సలహా లేకుండా ఎలాంటి మందులు వాడనక్కరలేదు.

☐ తల్లిపాల ఉత్పత్తికి ఎలాంటి మందులులేవు. తరచుగా పాలు పడితే, పాల ఉత్పత్తి బాగుంటుంది.

☐ కడుపునిండా ఆహారం తింటే చాలు ప్రత్యేకంగా ఆహారం తీసుకోనక్కరలేదు.

☐ తల్లులందరూ విజయవంతంగా తమ చిన్నారులకు పాలు పట్టాలంటే కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరం. సామాజిక సహకారం చాలా అవసరం.

☐ డాక్టర్లు- ఆరోగ్యకార్యకర్తలు తెలికగా ప్రత్యామ్నాయాలు చెప్పకుండా, తల్లులు చిన్నారులకు తమ పాలు పట్టడానికి కావలసిన సహకారం మాత్రమే అందించాలి. డాక్టర్లు- ఆరోగ్యకార్యకర్తలు తల్లిపాల రక్షణకు మాత్రమే కృషి చేయాలి.

☐ పాలసీసాలు- పాలపీకలు సాధ్యమైనంతవరకు వాడరాదు.

(ఆగష్టు 1 నుండి 7 వరకు ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా...)

రచయిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కో ఆర్డినేటర్, బ్రెస్ట్‌ఫీడింగ్ ప్రమోషన్ నెట్ వర్క్ ఆఫ్ ఇండియా.

సీరియల్

గని



జరిగినకథ:

ఆ సంఘటనతో బికాస్ తండ్రి ఎంతగానో కుమిలిపోతాడు. తన జీవితంలో అనుభవించిన పేదరికాన్ని, ఆకలిని గుర్తుచేసుకుంటాడు. ప్రాణంలో ప్రాణంగా సాగుచేసుకున్న భూమి తన చేజారిపోతున్నందుకు విలవిల్లాడిపోతాడు. అప్పు తీర్చలేక కామందుకు బానిస కాబోతున్నందుకు విపరీతంగా బాధపడతాడు. దానికంటే ఆత్మహత్యే శరణ్యమని భావిస్తాడు. అయితే ఆక్షణంలోనే పెళ్లాంబిడ్డలు గుర్తొస్తారు. కూతురుకంటే పెళ్లయింది. మరి కొడుకో! పసోడు. భార్యాకుమారుడు బతుకు బండి ఎలాగోలా లాక్కొస్తారనుకుంటాడు. అయితే అతని భార్య ఈ ఆలోచనలన్నిటిని కనిపెడుతుంది. భర్త పోయినా అతని భార్యను బానిసత్వం చుట్టేస్తుంది. అందుకే ఇద్దరూ కలిసి చనిపోదామనుకుంటారు. తమ తదనంతరం బికాస్ బాధ్యత తమ పెద్ద కుమార్తె చూసుకుంటుందని భావిస్తారు. జీవితాన్ని ముగించుకుంటారు బలవంతంగా. గతంలోంచి ప్రస్తుతానికొస్తే...అక్కాబావా వచ్చేసరికి బికాస్ బుద్ధిగా వంట చేసుకుంటాడు. అతడ్ని చూసి వారు మురిసిపోతారు. పోరాటాలు, ఆందోళనల జోలికి పోకుండా బుద్ధిగా కుటుంబ వ్యవహారాల్లో చేదోడువాదోడుగా వుంటే బావుంటుందనుకుంటారు. గని కార్మికుల విషయానికొస్తే... వారు తీసుకున్న అప్పుకు భార్యల శీలాన్ని దోచుకుంటుంటారు రుణదాతలు.

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(పద్దెనిమిదవ భాగం)

ఆమెకు శీలం గురించి గొప్పగొప్ప ఆలోచనలేమీ లేవు. ఏ పాపమైనా క్షుద్బాధాగ్ని జ్వాలల్లో మాడిమసై పోతుందన్నది ఆమె అవగాహన. మొద్దుబారిన మనస్సుతో మేకల కొట్టంలో దూరింది. ఆ వెనుకే అప్పులవాడూ దూరాడు. మేక ఒంట్లోంచి వచ్చే వాసనా, పేడా, మూత్రమూ కలగలిసిన కంపూ ఎవరికైనా డోకొస్తుంది. గానీ కామవాంఛ సున్నితమైన అనుభూతుల్ని స్తంభింపజేస్తుంది కాబోలు! ఆమె ఈతాకుల్ని చాపలా పరచుకొని కూచుంది. అతడామె చెంత చేరాడు. కామాతి రేకంతో పెంటిమేకను సమీపిస్తోన్న పోతుమేక ఓ కాలు పైకెత్తి, అతడి మొహంమీదే మూత్రం పోసింది!

"ఛీ.... ఛీ..... లెయ్. పశువుకు కూడా ఇది పట్టలేదు. నువ్వు మనిషివా! ఛీ" అందామె.

ఈ మాటలేవీ అతడి తలకెక్కలేదు. ఆ అసహ్య ఘటన అతడిలో ఆలోచనను పురిగొల్పలేదు. అతడికి కావలసిందల్లా ఆడదాని దేహం మాత్రమే. అతడే ఏమిటి, అహల్య కోసం బయలుదేరిన ఇంద్రుడిలా! ఆ చీకట్లో ఎందరు బయలుదేరారో? ఆమె అనుకొంది 'దేవుడా! ఈ మృగాన్ని ఏ పామూ కాటేయదా?"

ఆమెది ఇష్టంలేని అనుభవం. కుటుంబాన్ని ఎలాగైనా గట్టెక్కించాలన్న తాపత్రయం, ఆంజనేయుడి తోకలా పెరిగిపోయిన ఋణదాతకు శయ్యాసుఖాన్ని ప్రసాదిస్తోంది. ప్రతిసారీ గుండె ఆవేశంతో రగులుతోంది. అతడు తాకినపుడల్లా దేహం దహించుకుపోతోంది.

"ఇవాళ ఎలాగైనా వీడిని ఇరికించాలి. ఎన్నటికీ తీరని అప్పుకోసం ఎన్నాళ్లిలా ఒళ్లప్పగించాలి, దీనికి స్వస్తి పలకాలి" అని నిర్ణయించుకొంది.

వీధిలో ఎవరో మాట్లాడుకొంటూ వెళుతున్నారు. ఇదే అదనని భావించింది. మాటల శబ్దం మరింత చేరువయింది. "అయ్యో! దొంగ దొంగ మేకల దొంగ" అని గట్టిగా అరిచింది.

అప్పులవాడికి ఏమీ బోధపడలేదు. చీకట్లో ఏమీ కనిపించకపోవడంతో, "ఏమి ఏమి" అని గుసగుసలాడాడు.

సున్నితత్వం ఏమాత్రం లేని కఠిన జీవనం ఆమెను అసహజచర్యలకు ఉసిగొల్పింది. శారీరకంగాను, మానసికంగానూ చిత్రహింసకు గురవుతోన్న నిస్సహాయ స్త్రీ నిరంతర లైంగిక దోపిడీ నుంచి బయట పడడానికి ధైర్యాన్నంతా కూడగట్టుకొని, "ఎవడో దొంగ. లోపల దూరాడు. నువు పారిపో" అంది. అతడి క్షేమాన్ని కాంక్షిస్తున్నట్టు అభినయిస్తూ.

వేటగాడ్ని చూడగానే ఎలుక వలకేసి పరుగెత్తినట్టు, అతడు మేకల కొట్టంలోంచి బయటికి దూకి పరుగెత్తసాగాడు. ఆమె "దొంగ పారిపోతున్నాడు, పట్టుకోండి, పట్టుకోండి" అంటూ అరిచింది. ఈ శబ్దానికి ఓ వారగా పడుకొన్న కుక్క కాస్తా లేచి అతడి మీదికి ఉరికింది. అతడు నిలువెల్లా కంపిస్తూ కిందపడ్డాడు. కుక్క అతడ్ని రక్కేసింది. బంధాల్ని దారిన పోతున్న వాళ్ళు వచ్చి చేరారు. అప్పులవాడు దొరికిపోయాడు.

వచ్చి చేరిన వాళ్లకు విషయమేమిటో అర్థమయింది. గని కార్మికులకు అప్పులిచ్చి, వాళ్లను నిరంతరం తమ బానిసలుగా వాడుకోనే ఋణదాతల్లో రకరకాల మనుషులున్నారు. అప్పులిచ్చి, ఆడవాళ్ళను అనుభవించాలన్న కుత్సిత స్వభావం ఇతడిది, తప్పించుకోలేని విధంగా పట్టుబడ్డాడని గ్రహించిన జనం "ఎవరు, రాంసింగా!" విస్మయం ధ్వనించేలా అడిగారు.

తాను అవసరమైనప్పుడు వీళ్లకు అప్పులిచ్చి ఆదుకొనే పెద్దమనిషినన్న హోదాను నిలబెట్టుకొంటున్న ధోరణిలో "అవును" అన్నాడు నిరాశా వేదనా నిండిన స్వరంతో. ఇలాంటి అవకాశం మళ్లీ దొరకదని గ్రహించారు జనం. మరోవైపు, మళ్ళీ మనం ఇతడి వద్ద చేతులు చాచాల్సి ఉంటుంది కదా అని కాస్త సంశయించారు. తాము వేసే బాణం తమను కాపాడడంతో బాటు శత్రువును ఖచ్చితంగా

పడగొట్టేదిగానూ ఉండాలని భావించారు. 'ఏం జరిగింది?' అని ఆమెను ప్రశ్నించారు.

అవమానానికి లోనయిన స్త్రీ హృదయంలోంచి పెల్లుబడిన క్రోధాగ్ని జ్వాల ఈ ప్రశ్నతో కొద్దిగా శాంతించింది. ఏం చెప్పాలో తోచలేదు. గుండె లోపలి ధైర్యమంతా ఇంకిపోయినట్టనిపించింది. తేలు కుట్టిన దొంగలా ఉంది తన పరిస్థితి. నోరు మెదపలేదు.

తనకు అనుకూలంగా మలచుకొంటూ ఆమె మౌనాన్ని "దీని మొగుడు ఇవాళ వడ్డీ చెల్లించలేదు. అందుకని వచ్చాను" అన్నాడు కనుబొమలెగరేస్తూ, కాస్త కటువుగా. ఆమె ఆశ్చర్యచకితురాలయింది. ఇప్పుడు ధైర్యం కూడగట్టుకొని వెల్లడించకపోతే కుటుంబాన్ని శాశ్వతంగా అప్పుల ఊబిలోకి నెట్టేసేలా ఉన్నాడీ దుష్టుడు. దుమ్ము పడిన కళ్ళను తుడుచుకొంది. చూపుడు వేలితో ముక్కు తుడుచుకొని, మెల్లగా చెప్పింది. "ఆయన అబద్ధం చెబుతున్నాడు. నాలుక తడబడుతోంది. అంత చలిలోనూ చెమట పట్టింది. గుండె గొంతుకలో కొట్లాడుతోంది. ఆలోచించే కొద్దీ గుండె దడదడలాతోంది. తట్టుకోవాలంటే ఏం చెప్పాలి? వడ్డీ చెల్లించనందువల్ల శారీరక సుఖం కావాలని బలవంత పెట్టాడనా అది నిజమే అయినప్పటికీ, అతడు బలాత్కారం చేయలేదుగా అంటే, పేదరికాన్ని ఆసరా చేసుకొని, మానసికంగా కుంగదీసి, లొంగదీసుకోవడం బలాత్కారం కాదా? ఇది తాను మనసారా కోరుకున్న సుఖం కాదుగా!

అంతలో బికాస్ చౌదరి వచ్చాడు. అక్కడ గుమిగూడి ఉన్న జనానికి నమ్మకమూ ధైర్యమూ కలిగాయి. ఆ జనంలో కొందరు ఋణదాతల దగ్గర అప్పు చేసిన వాళ్ళు కావడంతో, ఈ విషయాన్ని మరీ సాగదీస్తే ఋణదాతలంతా ఏకమై మొదటికే మోసం రావచ్చని భయపడుతున్నారు.

బికాస్‌కు విషయం బోధపడింది. ఇది మంచి తరుణం. వడ్డీ వ్యాపారి చిక్కుకున్నాడు. 'కుక్క కాటుకు చెప్పు దెబ్బ' అన్నట్టుగా గుణపాఠం నేర్పాలి. మిగతా వడ్డీ వ్యాపారులకు ఇది హెచ్చరికగా ఉండాలి. ఈ వడ్డీ వ్యాపారి వల్ల ఇబ్బందిగానీ, ఆపదగానీ కలగబోదని ఆ స్త్రీకి నమ్మకం కలిగించాలి. గని కార్మికుల కోసం ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకొంటూ, కొండకచో చావు దెబ్బలు కూడా తింటున్న కార్మికనాయకుడిగా ఎదిగిన బికాస్ గురించి కార్మికుల ఇళ్ళలోని ఆడవాళ్ళకు తెలియకపోలేదు. బికాస్ ఆమెకు ధైర్యం కల్పిస్తూ చెప్పాడు.

"భయపడకమ్మా! సంఘం మీకు వెన్నుదన్నులా ఉంటుంది. ఇతడి మూలంగా మీకు ఏ ఇబ్బందీ కలగకుండా చూసే పూచీ మాది. నువ్వు ధైర్యంగా నిజం చెప్పు".

అప్పులవాడికి గుండెలో ముల్లు గుచ్చుకొన్నట్లనిపించింది. తన బండారం బయట పెట్టేస్తుందేమోనని భయపడ్డాడు. ఈ శనిగ్రహం దాపురించాడే! వీడు రాకుండా ఉంటే, మిగతా వాళ్లకు ఏదో విధంగా సర్ది చేప్పేసేవాడ్ని. ఈ ఆడముండ కూడా నోరు మెదిపేది కాదు. ఇక దేవుడే దిక్కు అనుకొని "నేను చీకట్లో లాంతరు లేకుండా రావడంతో ఎవడో పరాయి వాడునుకొని కుక్క నా మీద పడి బట్టలు చించేసింది. ఈవిడ కూడా చీకట్లో ఏమీ పాలుపోకపోవడంతో "దొంగ దొంగ" అని కేక పెట్టింది. అన్నాడు. తన మాటల్లో భయంగానీ, బాధ గానీ, లోపం గానీ కనబడనీయకుండా జాగ్రత్తపడ్డాడు.

బికాస్ ఆదరాభిమానాలు ధ్వనించే స్వరంతో "ఎందుకమ్మా తటపటాయిస్తూన్నావు?" అన్నాడు, ధైర్యం చెబుతున్నట్టు.

తన దీనస్థితి, దిగమింగిన అవమానాలు, చేదుబతుకు అన్నీ ఆమెకు గుర్తొచ్చాయి. "మా ఆయన ఈ నెలకుగాను వడ్డీ చెల్లించలేదు. దాన్ని మాఫీ చేస్తాను, నువ్వు నన్ను సుఖపెట్టు అంటూ వీడు నేనెంత వారించినా వినకుండా నన్ను దగ్గరకు లాక్కోవడానికి ప్రయ్నతించాడు. వీడి బారి నుండి తప్పించుకోవడం కోసం నేను అరిచాను" అంది వెక్కి వెక్కి ఏడుస్తూ. లోగుట్టు పెరుమాళ్ళకెరుక అన్నట్టుగా ఇంట్లో పడుకొని ఇదంతా వింటోన్న ఆమె భర్త తన కష్టాలు తీరిపోయే అవకాశం లభించిందని గ్రహించి ఇంట్లోంచి బయటికి వచ్చి, ఏమీ తెలియని వాడిలా జరిగినదంతా అడిగి తెలుసుకొన్నాడు. తన భార్యకు మానహాని కలిగించిన వాడ్ని చూసి నిజంగానే కోపంతో ఊగిపోతున్నట్టు అభినయించాడు. అయితే అక్కడ గుమిగూడిన వాళ్ళందరికీ అసలు విషయం తెలుసు. తమ బలహీనతల వల్ల మగాళ్ళు భార్యల అక్రమ సంబంధాలను చూసిచూడనట్టు ఉండడం అక్కడ బహిరంగ రహస్యం. అయినప్పటికీ, ఈ దోపిడీని అరికట్టే అవకాశాన్ని జారవిడువరాదని సంఘం నాయకులు భావించారు.

అప్పులోడి మెడకు వేలాడుతోన్న గుడ్డను బిగించి పట్టుకొన్నాడు బికాస్. "జలగలా మా రక్తం పీలుస్తున్నావు కదరా" అంటూ అతడి మొగం మీద బలంగా కొట్టాడు.

ధనబలంతో గూండాలను పోషిస్తూ, ఇష్టారాజ్యంగా వ్యవహరించే అప్పులోళ్లను ఇలా ఎదుర్కోవడం స్వప్నంలో సైతం సంభవించని విషయం, అలాంటి ధనాధిపతుల్లో ఒకడిప్పుడు చిక్కుకొన్నాడు. మనిషి బక్క పలుచగా రివటలా ఉన్నా, అధికవడ్డీకి డబ్బులు తిప్పి ధనం కూడబెట్టడంలో సాటిలేనిమేటి, ఒక్కోసారి మరీ తొందరగా కోట్లకు పడగలెత్తాలన్న మోహం పుడుతుంది. అప్పుడు అన్ని నిబంధనలనూ తుంగలో తొక్కడానికి వెనకాడడు.

ఋణగ్రస్తుడి మెడ వంచి అన్ని పనులా చేయించుకోవడానికి అలవాటు పడ్డ పెద్దమనిషి ఇవాళ కుడితిలో పడ్డ ఎలకలా గింజుకొంటున్నాడు. ఓసారి అప్పులోళ్ళు సమావేశంలో దయాదాక్షిణ్యాలు ఏ మాత్రం చూపకుండా ముక్కుపిండి వడ్డీ వసూలు చేయడం, గురించి శిక్షణా తరగతి, నిర్వహించారు. అందులో నొక్కివక్కాణించిన విషయం ఋణగ్రస్తుడి ఇంట్లోనే ఆడవాళ్ళతో శారీరకంగా సంబంధం పెట్టుకోరాదని. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని బోధించారు. ఆ సూచనను పెడచెవిన పెట్టడం, ఎంత ప్రమాదంలో పడేసింది!" అనుకొని కుమిలిపోతున్నాడు. ఎవడో దొంగ చిక్కుకొన్నాడన్న వార్త క్షణాల్లో వ్యాపించి పెద్ద ఎత్తున జనం అక్కడికి రాసాగారు. వచ్చిన తర్వాత వాళ్లకు అసలు విషయం బోధపడింది. గతంలో ఏదో ఒక విధంగా అతడి దోపిడీకీ, హింసలూ లోనయినవాళ్ళు

"వీడ్ని ఊరికే వదిలిపెట్టకూడదు. జీవితాంతం మర్చిపోలేని విధంగా తగిన శాస్తి చెయ్యాలి! అనుకొని "ఒరేయ్ నీచుడా! అప్పు చేసిన వాడి ఇల్లాలు నీ ఉంపుడుగత్తె అనుకొంటావా? అప్పిచ్చినంత మాత్రాన నీకు ఆడవాళ్లమీద హక్కు వచ్చేసినట్టేనా?" అని ప్రశ్నిస్తూ, అందిన చోటల్లా పిడిగుద్దులు గుద్దసాగారు.

ఇదంతా గమనిస్తోన్న బికాస్ "మీరు చేసిన దేహశుద్ధి చాలు, ఇక కొట్టకండి. అతడ్ని హింసించడం మన ఉద్దేశ్యం కాదు. ఈ కుటుంబం చేసిన అప్పును మొత్తంగా మాఫీ చేయాలి. తక్కినవాళ్ళ దగ్గర ధర్మ వడ్డీ మాత్రమే తీసుకోవాలి" అని చెప్పి అతడి ఆమోదం కోసం ఆగాడు.

అతడు చేతులు పిసుక్కొన్నాడు. కళ్ళు పైకీ కిందికి తిప్పుతూ, ఏం చెప్పాలో పాలుపోక మిన్నకుండిపోయాడు. బికాస్ అతడికేసి హేళనగా నవ్వాడు. అగ్ని పర్వతాల్లా ఉడికిపోతోన్న యువకులతో "వీడి చేతులు విరిచికట్టి లాక్కురండి. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళదాం" అన్నాడు.

ఆ మాటలు అతడిపై మంత్రాల్లా పనిచేశాయి. ఇక తప్పించుకోవడం, అసాధ్యమని గ్రహించి "మీ మాట సుగ్రీవాజ్ఞ" అన్నాడు, బొంగురుపోయిన గొంతుతో.

తప్పనిసరి పరిస్థితుల్లోనే అతడు బికాస్ షరతులకు అంగీకరించినా సామాజిక కోణంలో చూస్తే శిక్షించపబడినట్టే.

బికాస్ ఆమె పెనిమిటిని చూసి "ఇంకైనా జూదం మానుకొని, కుటుంబాన్ని సరిగా పోషించు. నీ భార్య గౌరవమే కుటుంబ గౌరవంగా భావించి మసలుకో" అన్నాడు.

మిగతా వాళ్ళనుద్దేశించి, "మన మధ్య ఐకమత్యం ఉంటే అన్యాయాన్ని అరికట్టగలమని గ్రహించండి" అన్నాడు. భయమూ, నమ్మకమూ కలగలిసిన కళ్ళతో 'మరో ప్రపంచ'పు మనిషిని చూస్తున్నట్టు బికాస్ కేసి చూశారు వాళ్ళు.ట

బికాస్ ద్విగుణీకృతమైన ఉత్సాహంతో వాళ్ళకేసి చూస్తూ ఆనందంగా నవ్వసాగాడు.

(ఇంకావుంది)

చిత్ర విచిత్రం



ఎన్నో చెప్పాలి

హాఁయ్ పిడుగులూ! ఈ కొండని చూశారా. కాస్త జాగ్రత్తగా పరిశీలించండి? ఏం కనిపించింది మీకు. కొన్ని ముఖాలు కనిపిస్తున్నాయి కదూ. అయితే అవి ఎన్నో చెప్పండి?

దారిచెప్తే పోలా!





నేర్చుకుందాం

నీడ ఏదబ్బా...!

పిల్లలూ... కింద మీకు ఒకబ్బాయి బొమ్మ, దాని నీడలు నాలుగు కనిపిస్తున్నాయి చూశారా. మీరేం చేయాలంటే ఆ పెద్ద బొమ్మ నీడ ఏదో కనిపెట్టి చెప్పాలి. సరేనా.



బాలనేస్తాలు

నవ్వు - కోపం

నేస్తాలూ! చూశారుగా ఇద్దరు నేస్తాలు ఎంచక్కా నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. వారు కోపంగా పోట్లాడుకునేలా చేయాలి.ఎలా? ఏంటీ ఎంతకీ తెలీడం లేదా! అయితే జవాబు చూసేయండి.



రంగులేద్దామా...



1 ఎరుపు 2 నీలం 3 పసుపు 4 నారింజ 5 కాఫీకలర్

ఆకు జంతువులు

హాయ్ నేస్తాలూ! ఈ వారం మీకోసం ఓ మాంచి ఐటమ్ తెచ్చాం. అదేంటో చెప్పకోండి చూద్దాం. ఓ తెలీదా! సరే...ఇదిగో మీ ముందు రెండు జంతువులున్నాయి చూశారా! వాటి పేర్లు చెప్పకోండి మరి. య్యెస్. సింహం, ఏనుగు. మరైతే వాటి ప్రత్యేకత కూడా చెప్పేయండీ... ఆ అవును. వాటిని ఆకులతో చేశారు. మన పెరట్లో... సమీప పరిసరాల్లో...కొన్ని కొన్ని మొక్కలు, చెట్లు వుంటాయికదా. వాటి ఆకులు రకరకాల ఆకారాల్లో వుంటాయి. వాటిని మీరు సేకరించాలి. ఎంచక్కాఒక లావాటి పుస్తకంలో పెట్టి ఎండనివ్వాలి. తర్వాత ఇదిగో ఇలా జంతువుల ఆకారాల్లో అతికించాలి. అంతే.

సరేగానీ... ఈ వారానికి ఈ రెండు జంతువులను చేయండి. పైవారం మరో రెండు 'ఆకు జంతువులతో' మీ ముందుంటాం. ఎదురుచూస్తుంటారుగా. బైబై.



జవాబులు

నీడ ఏదబ్బా ....: C

ఎన్నో చెప్పాలి :ఆరు

నవ్వు - కోపం
పుస్తకం తిరగేసి చూడండి చాలు.

అష్టమది కథ

నేస్తమా... షత్రియా...

- డా॥కాకర్లమూడి విజయ్

రక్త సంబంధాలకూ,
బీరకాయ పీచు
బంధుత్వాలకూ, చత్వారపు
చుట్టరికాలకూ అతీతంగా
ఉండేది స్నేహం. నిజానికి
వాటన్నిటికన్నా అందమైనదీ,
అపురూపమైనదీ,
అద్భుతమైనదీ,
అత్యున్నతమైనదీ స్నేహమే.
ఇటువంటి ఎన్నో విశేషణాలు
జోడించి స్నేహాన్ని
వర్ణించడానికి చేసిన
ప్రయత్నంలో ఎన్నెన్నో కథలు,
కవితలు రూపొందాయి. కానీ
స్నేహానికి వివరణలు, వర్ణనలు,
తాఖీదులు, హామీలు
అవసరం లేదు. ఎందుకంటే
స్నేహం మనసుకు
సంబంధించిన విషయం.
అనుభూతులకు
నెలవు. అనుభవాలకు
కొలువు.

మనుషుల్లో, జంతువుల్లో కూడా సాంగత్యం, తోడు అవసరం. ఏకాకిగా, ఒంటరిగా జీవించడం కష్టం. చాలా మందికి అయిష్టం. అటువంటి తోడు ఎవరినుండైనా, ఎటువైపు నుండైనా రావచ్చు. మరీ చిన్నప్పుడు 'తోడు' ఎంచుకునే వీలు, అవకాశం లేకపోవడంతో అందరూ విపరీతంగా కురిపించే ఆప్యాయతా, గారాబాల జడితో తడిసి ముద్దైపోయినా, వయసు పెరిగే కొద్దీ మనసు కావలసిన వారితోనే జట్టుకట్టడం ప్రారంభమౌతుంది. అది ఎలా మొదలౌతుందో, ఏ లక్షణాలు, పరిస్థితులు, ప్రభావాలు అందుకు ప్రేరేపిస్తాయో కూడా మనకు తెలీదు. సాధారణంగా దాదాపు సమవయస్కుల తోటే సహవాసం మొదలౌతుంది.

అయితే ఇంట్లో సమవయస్కులు వుండడం అరుదు. "అందుకే ఇంట్లోవాళ్లు స్నేహితులు కారు" అని చెప్పారు మూర్తి. చాలా సినిమాల్లో, కొన్ని కుటుంబాల్లో కూడా "మానాన్న నేను ఫ్రెండ్స్, మా మమ్మీయే నా క్లోజ్‌ఫ్రెండ్" అంటూ పడికట్టు పదాలున్నా అవన్నీ వాస్తవాల్లో వుండవు. ఎక్కడైతే స్నేహం వుందో అక్కడ భయం, దానివల్ల వచ్చిన గౌరవం వుండవు. అవి రెండూ లేకపోతే తండ్రులు, తల్లులు తమ పిల్లల్ని 'దారి తప్పిన' వారిగా చూస్తారు. కాబట్టి వారి మధ్య ఫ్రెండ్‌షిప్ ఎలా వుంటుందో చెప్పాలి" అంటూ వివరిస్తాడు మూర్తి స్నేహితుడు రాజు.

మూర్తి, రాజు బాపు రమణల్లా మంచి ఫ్రెండ్స్. వేర్వేరు వూళ్లనుండి వచ్చిన వీరిద్దరూ నగరంలోని స్కూల్లో ఫ్రెండ్సయ్యారు.

"మూర్తికి స్కూల్లో మంచి మార్కులొచ్చేవి. నాకు అంతగా వచ్చేవి కాదు. అందుకని మా టీచర్ నన్ను మూర్తి పక్కన కూర్చోబెట్టింది. అలా ప్రారంభమైంది మా స్నేహం" అంటూ తమ సాంగత్య మూలాల్ని వెల్లడించాడు రాజు.

"స్కూలు నుండి బయటపడేసరికి రాజే క్లాస్ టాపరయ్యాడు. అందరూ మాది గొప్ప స్నేహం అంటుండేవారు" చెప్పాడు మూర్తి.

స్నేహంలో విశేషమదే. ఒకరితో ఒకరు ప్రభావితమవ్వడం, ఒకరికి ఒకరు కలిసి ఎదగడం. మిగతా సాంగత్యాలలో ఇటువంటివి కాస్త తక్కువ. బంధువుల్లో కూడా కాస్త దగ్గరి వయసున్న వారు ఫ్రెండ్స్‌గా వుండే అవకాశం వుంది. కానీ ఎప్పుడో ఒకప్పుడు వారి బంధుత్వం వారిమధ్య వున్న స్నేహాన్ని అధిగమిస్తుంది. అప్పుడు కొన్ని

అవాంఛనీయ పరిస్థితులు తలెత్తుతాయి. "నిజమే! మా పిన్ని కొడుకు నా ఫ్రెండే. కానీ వాళ్లకు మంచిరోజులు వచ్చాక ఆ కుంటుంబం మాకు దూరమయ్యింది. నా ఫ్రెండు వరసకు అన్న కూడా. ఆ బంధుత్వ ప్రభావంలో పడి మొహం చాటెయ్యడం మొదలెట్టాడు" అని తన అనుభవాన్ని వివరించాడు శాస్త్రి.

స్నేహానికి పరిధులూ, ఆటంకాలూ, అవరోధాలూ, లేనట్టే నిబంధనలూ, లెక్కలూ, నిర్వచనాలూ వుండవు. అటువంటివన్నీ సరదాగా ఎవరికి వారు తయారు చేసుకున్నవే. ఎప్పుడైతే మానవ సంబంధాలు ప్రారంభమౌతాయో వాటన్నిటిలో అవాంఛనీయమైన కోపాలు కనిపిస్తాయి. స్నేహాల్లో ద్వేషాలూ, కోపాలు, తాపాలు, కొట్లాటలూ, కలిసిపోవడాలూ, మొహమాటాలూ, మర్యాదలూ, గౌరవాలూ, మన్ననలూ, మోసాలూ... అన్నీ వుండే అవకాశముంది. అలాంటి పరిస్థితులు ఎదుర్కొన్న, అనుభవించిన స్నేహితులు చాలా చోట్ల తారసపడతారు.

"నా ఫ్రెండ్‌కున్న కొన్ని అలవాట్లు నన్ను ఇబ్బంది పెడుతుంటాయి. ఒక ఫ్రెండ్‌గా వాటిని మానమని చెప్తుంటాను. కానీ అవి మానితే అతనికి ఇబ్బందేమోనన్న ఆలోచన నన్ను నా ప్రయత్నాలని విరమింపచేస్తుంది" అన్న శాస్త్రి అనుభవంలో ఒక కీలక అంశం వుంది. తన స్నేహితుడు బాధ పడతాడేమోన్న బాధతో కొన్ని పనులు చేయడానికి మనస్కరించని తత్వమూ స్నేహంలో వుంది. కొన్నిసార్లు అదే ఆ బంధాన్ని బలోపేతం చేయడానికి ఉపకరిస్తుంది. 'నా వ్యక్తిగత అలవాట్లను మార్చడానికి నువ్వెవరూ' అనే ఆలోచన వచ్చిందంటే అహం దెబ్బతిని బంధం విడిపోవచ్చు. మరో విధంగా నా అలవాట్లు తప్పని తెలిసినా వాటిని మాన్పించే ప్రయత్నం చేయని వాడు నాఫ్రెండేనా? అనే విచిత్ర పరిస్థితీ రావచ్చు.

అంటే స్నేహం గొప్పదే కావచ్చు. కానీ అన్ని బంధాల లాగే అదీ అన్ని రకాల ప్రభావాలకూ లోనవుతుంది. స్నేహం అద్భుతమైనదే కావచ్చు. కానీ సాధారణ ఆటుపోట్లకు అతీతమైనది కాదు. అయితే మన జీవితాల్లో కనిపించే ఎన్నో సంబంధాలకన్నా విశేషమైనది. కష్టసుఖాల్లో పాలు పంచుకోవడం దగ్గరనుండి కాకమ్మ కబుర్లు చెప్పుకుంటూ కాలం గడిపేయడం వరకూ స్నేహంలో చోటుంది. ఎవరికివారు ఎవరిపనుల్లో వారు తీరుబడి లేకుండా పగలంతా గడిపి, సాయంకాలానికి స్నేహితుడి కోసం ఎదురు చూస్తుంటారు. నలుగురైదుగురు మిత్రులు కలిసి 'దోచార్ ఛాయ్' ల మధ్య వెలుగు చీకట్లో కలిసే వరకు మాట్లాడుకుంటారు. ఇదమిద్ధంగా ఇదీ అని కాకుండా అన్ని విషయాలు విస్తారంగా చర్చించుకుంటారు. సానియా మీర్జా పెళ్లినుండి సార్క్ శిఖరాగ్ర చర్చల వరకు, టీవీ రియాల్టీ షోల నుండి లేటెస్ట్ సెల్‌ఫోన్ల వరకు వారిమధ్య విస్తరించని విషయం వుండదు. ఆ నలుగురైదుగురు దోస్తులలో ఒకరిద్దరు ఎప్పుడూ 'బక్రా'లవుతుంటారు. గిల్లికజ్జాలు, ఏడ్పించడాలూ, ఉడికించడాలూ మధ్య వీడ్కోలుతో విడిపోతుంటారు మళ్లీ రేపు కలవడానికి.

అన్ని స్నేహాలు ఇలా డైలీ బేసిస్‌లో ఎదురుపడడం కుదరదు. వ్యక్తిగత జీవితాల్లో మార్పులు ఒక్కొక్కరిని ఒక్కోచోట విసిరేస్తాయి. భౌతికంగా దూరాలను పెంచుతాయి. అటువంటప్పుడు బరువుగుండెలూ, నిర్వేదాలూ, విచారాలూ -మామూలే. కానీ స్నేహం మాత్రం పల్చబడదు. రోజువారీ పలకరింపులు తక్కువైనా అవకాశం వచ్చినప్పుడల్లా దూరంగా ఉన్న స్నేహితుల ప్రస్తావనకు ఎప్పుడూ స్థానం ఉంటుంది. ఇక్కడ జరిగే సంగతులు, అక్కడ జరిగిన విశేషాలు ఒకరికొకరు

స్నేహానికీ ఓ రోజు...

ఫ్రెండ్షిప్ డే ప్రతి ఏడాది ఆగష్టు మొదటి ఆదివారం జరుపుకుంటారు. ఈ ఆచారం 1935 లో అమెరికాలో జాతీయ స్నేహ దినోత్సవంగా ప్రారంభమైంది. క్రమక్రమంగా అది అంతర్జాతీయ స్థాయి సంబరంగా మారింది. నిజానికి కొన్నింటికి ప్రత్యేక ప్రస్తావన అవసరంలేదు. అందులోనూ అందమైన స్నేహాలకి. అయినా ఎన్నో రకాల రోజులు ప్రత్యేకంగా ఏర్పరుచున్నట్టే దీనినీ ఆచరిస్తున్నారు. రాఖీరోజును మణికట్టుకు కట్టే తాళ్లతో అన్నా చెల్లెళ్ల బంధాన్ని ఏర్పరచుకున్నట్టూ, బలోపేతం చేసినట్టూ ఫ్రెండ్షిప్ డే నాడు ప్రత్యేక ఫ్రెండ్షిప్ బ్యాండ్లు ధరించడం ఫ్యాషనైంది. ఇదంతా కుర్రకారు వ్యవహారం.

చాలా దేశాలు జులై 20ని స్నేహితుల దినోత్సవం (ఫ్రెండ్షిప్ డే)గా జరుపుకుంటాయి.

మహిళా స్నేహ దినోత్సవం - ఆగస్టు మూడవ వారం

అంతర్జాతీయ స్నేహమాసం - ఫిబ్రవరి

పాత, కొత్త స్నేహితుల వారం - మే మూడవ వారం

ఇచ్చిపుచ్చుకుంటారు. కష్టాలేమైనా వుంటే ఒకరితో ఒకరు చెప్పి వాటిని తగ్గించుకుంటారు. సంతోషాలని మరింత సంతోషంగా మలచుకుంటారు. వయసు, కాలంతో పాటు స్నేహం మరింత బలపడుతుంది, పెరుగుతుంది. ఏ ముదిమి వయసులోనో కలిసినపుడు పాత జ్ఞాపకాలను తోడుకుని ఒక్కో బొట్టును మనసారా ఆస్వాదించుకోవడం ఒక మధురమైన అనుభూతి. ఇటువంటి అనుభూతులు 'మామూలు' బంధుత్వాలలో లభించవు. స్వార్థరహితమైన స్నేహానికున్న విలువ అది.

అయితే ఎటువంటి స్నేహంలో అయినా కాస్తో కూస్తో స్వార్థం అవసరం. లేకపోతే అది మరీ పొడిపొడిగా వుంటుంది. నిరాసక్తంగా వుంటుంది. అదే స్వార్థం కనుక ఎక్కువైతే స్నేహం ఇబ్బందిగా మారుతుంది. ఇబ్బంది పెడుతుంది. "ఇటువంటి అధికస్వార్థస్నేహం ఆడమగ స్నేహాల్లో కనిపిస్తుంది. దాన్ని వారు ప్రేమ అంటారు. కొన్ని సార్లు ఇద్దరు ఆడవాళ్ల మధ్య కూడా ఇటువంటి స్నేహం వుండొచ్చు. తమ స్నేహితులు తమతో మాత్రమే వుండాలన్న ఆలోచన అది. చిన్నపిల్లల్లో కూడా ఇటువంటి మనస్తత్వం వుంటుంది. కాకపోతే పెద్దవారయ్యాక కూడా ఆ మనస్తత్వం మారని వారిలోనే అటువంటి భావాలు ఎక్కువ" అని చెప్పారు డా॥గణేష్.

"మానసిక స్థాయిలో స్నేహాలు గొప్ప విశేషాలు కావు. తోటివారితో కలిసి వుండడం అనే భావన నుండి పుట్టుకొచ్చినవే. తల్లి, తండ్రి, తోబుట్టువులు మినహా ఇతర బంధుత్వాలు మానవుడు సృష్టించినవే. ఒకరితో సన్నిహితంగా వుండడం మానవనైజం. ఆ క్రమంలో భాగమే స్నేహం. కాబట్టి ఆ కోణం నుండి చూస్తే స్నేహం మామూలు బంధమే. కానీ దానిలోని మరో అద్భుతకోణం ఎటువంటి నిబంధనలూ, నియంత్రణలూ లేకుండా కొనసాగడం. మన చుట్టాలతో కలిసి వుండడానికి చాలా కారణాలుంటాయి. స్నేహితుల మధ్య ఒక్క కారణమూ ఉండఖ్ఖర్లేదు" అంటారాయన.

స్కూల్లోనో, కాలనీలోనో, పార్కుల్లోనో, ఉద్యోగాల్లోనో ఎక్కడో అక్కడ నిత్యం కొత్త పరిచయాలు ఏర్పడుతూనే వుంటాయి. వాటిలో చాలా వరకు పరిచయాలుగానే మిగిలిపోతాయి. కొన్ని మాత్రమే స్నేహాలుగా మారతాయి. ఎదుటివారిలో ఏం చూసి స్నేహం చేస్తారన్నది శాస్త్రానికందని విషయం.

"వాళ్ల మంచితనం, ప్రవర్తన, మాట్లాడే విధానం... ఇలా ఏమైనా కావచ్చు. చాలావరకు తొలి రోజుల్లోనే అవతలి వారు ఫ్రెండ్స్ అవుతారో లేదో తెలిసిపోతుంది" అంటుంది కవిత.

ఈ మధ్య ఆర్థికస్తోమత, సామాజిక స్థాయి, కులం, మతం వంటివి కూడా స్నేహాల మనుగడను నియంత్రిస్తున్నాయన్న విషయం గుర్తు చేస్తే "అటువంటి స్నేహాలు తక్కువే. కానీ ఎందుకో అటువంటివి స్నేహాలు అనిపించుకోవు" అంటారామె.

స్నేహితులు సహజంగా ఏర్పడతారు. ఇతరుల ద్వారా పరిచయమైన వ్యక్తులు కూడా పరిచయం చేసిన వారికంటే గొప్ప స్నేహితులుగా మారవచ్చు. సాధారణంగా తమ భావసారూప్యతే స్నేహానికి దారితీస్తుంది.

ఈ మధ్య స్నేహాలు మారిపోయాయి. అవసరార్థపు మిత్రులు అధికమవుతున్నారు. కావలసిన పని జరగకపోతే ఒకరికొకరు దూరమవుతున్నారు. అపార్థాలూ, మనస్తాపాలూ, మౌన నిరసనలూ మామూలే అయినా అవి మరింత గాఢత చెందాయి. సిఫార్సులతో కాపురాలే కాదు, స్నేహాలూ చక్కబడవు, నిలబడవు – అసలు పుట్టవు కూడా.

నా సంతోషాలే కాదు నా బాధలు పంచుకోవడానికి ఒకరున్నారు అన్న భరోసా స్నేహం.

ఎన్నేళ్ల తర్వాతైనా, కలిసిన వెంటనే 'బావున్నావా' లాంటి మర్యాదలు అవసరం లేనిది స్నేహం. చదివిన పుస్తకాన్ని, వచ్చిన జ్ఞాపకాన్ని పంచాలనిపించేది స్నేహం. అందులో క్లోజ్ ఫ్రెండులూ, థిక్ ఫ్రెండులూ, థిక్కెస్ట్‌లూ, జాన్‌జిగ్రీలూ అనే వ్యత్యాసాలుండవు. 'ఇప్పుడు కోట్లు సంపాదిస్తున్న ఫలానా వాడు చిన్నప్పుడు నాఫ్రెండు' అనే పరిస్థితి వచ్చిందంటే అది ఫ్రెండ్‌షిప్పే కాదు, చిన్నప్పుడు మీరు ఒకరికొకరు తెలుసు అంతే. అదే నిజమైన ఫ్రెండైతే ఆ మాట అనే పరిస్థితి రాదు. ఎందుకంటే ఇప్పటికీ మీరు కలిసే వుంటారు. అయినా అతని ఉన్నతికి మీరు కుళ్లుకోరు. చింతించరు. మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోరు. అతనూ మిమ్మల్ని తక్కువ చేసి చూడడు. అదీ స్నేహంలోని చమక్కు.

ముఖాముఖి పరిచయం లేకుండా ఈ మధ్య విచ్చలవిడి అయిన ఇంటర్నెట్ స్నేహాలూ, కలం స్నేహాలూ, ఫోన్ స్నేహాలూ అన్నీ వేరొక లోకం. లెక్కల కోసం ఫ్రెండ్స్ తప్ప ఒక్కడూ నిజం కాదనే మిథ్యాలోకం.

'జీవితపుటెడారిలో

స్నేహాలు ఎండమావులే

అయినా అక్కడక్కడా

లేకపోలేదు

ఆత్మీయతా ఒయాసిస్సులు' అన్నాడో కవి.

అటువంటి ఒయాసిస్సులలో సేదతీరే వారిదే అదృష్టం. స్నేహంలో పెరుగుతారు. స్నేహంలోనే వృద్ధులౌతారు. కొన్ని స్నేహాలు బంధాలౌతాయి. కొన్ని బంధనాలౌతాయి. కానీ అన్నీ సజీవంగానే వుంటాయి.

ఇంత గొప్ప మానవ సంబంధానికి ప్రత్యేకంగా ఒక రోజు, వారం అంటూ కేటాయించడం మన సరదా అంతే. మానవ జీవితాలకి ఒక అర్థం కల్పించే స్నేహాలకి సలాం.

★



తెలుసా!

బుల్ బుల్ పిట్టల పోటీలు

ప్రపంచంలో అనేకరకాల పోటీలు జరుగుతుంటాయి. మనిషి తన అవసరాలకు, సరదాలకు కొన్ని రకాల పందాలను జరిపి ఆనందిస్తుంటాడు. ఈ కోవకు చెందినవే బుల్‌బుల్ పిట్టల పోటీ. బనారస్ ఈ పోటీలకు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పట్టణం. ఈ పోటీలు బనారస్‌లోనేగాక, కాన్పూర్ లక్నో, అలహాబాద్, జాన్‌పూర్ ఆగ్రాలలో కూడా జరుగుతుంటాయి. ఈ పోటీలు కార్తీకమాసంలో పౌర్ణమినాడుగానీ, దానికి ఒకరోజు అటూఇటూగానీ జరుగుతుంటాయి. పక్షులకు పోరాటంలో శిక్షణ ఇచ్చేవారిని ఉస్తాదులు అంటారు. ఈ పోటీలు ఎప్పుడు ఎలా ఆరంభమైనాయో చెప్పడానికి ఆధారాలు లేవుగానీ, మొఘల్ చక్రవర్తుల కాలంలో మాత్రం బాగా ప్రసిద్ధి చెందాయనడానికి తగిన సాక్ష్యాలున్నాయి. పోటీలు నిర్వహించే ప్రదేశాన్ని అందంగా అలంకరిస్తారు. రంగురంగుల డేరాలు ఏర్పాటు చేసి వాటిలో తెల్లటి దుప్పట్లు పరుస్తారు. తెల్లటి దుప్పట్లపై వాటికి ఇష్టమైన పళ్ళు, పప్పులు పోస్తారు. ముందురోజు తిండిలేక కడుపు మాడుతున్న పిట్టలు రెండూ ఆతృతగా దుప్పటిపైకి దూకుతాయి. ఆహారం మొత్తం తనకే దక్కాలన్న ఆరాటంతో అవి పోరాటానికి దిగుతాయి. రెండూ ముక్కులతో, రెక్కలతో, గోళ్ళతో యుద్ధం చేస్తుంటే ప్రేక్షకుల ఆతృత, ఉస్తాదుల హృదయస్పందనా పెరుగుతుంది. ఆ పక్షులు తమ శరీరాల్లో సత్తువ ఉన్నంతవరకు పోరాడుతాయి. చివరికి ఓ పక్షి రెండోదాని ధాటికి తట్టుకోలేక రంగంలోంచి తప్పుకుంటుంది. ఆ ఓడిన పక్షిని భగ్గా బుల్‌బుల్ అని పిలుస్తారు. కొంత విశ్రాంతి అనంతరం గెల్చిన పక్షి మరో పక్షితో తలపడుతుంది. ఈ విధంగా చివరికి అన్నింటినీ జయించిన పక్షిని విజేతగా ప్రకటిస్తారు. సామాజిక మార్పుల కారణంగా ఈ పోటీలకు నేడు ఏమంత ఆదరణ లేదు. అయితే అహార్, పాండే, చౌరాసియా వంటి తెగలు ఇప్పటికీ పిట్టల్ని మచ్చిక చేసుకోవడం, అడపాదడపా పోటీలు నిర్వహించడం చేస్తున్నాయి. బుల్ బుల్ చాలా సున్నితమైన పక్షి. ఎక్కువ వేడినీ, చలినీ తట్టుకోలేదు. మామిడి, జామ, టమోటా, వేరుశనగ పప్పులు వీటికి ఇష్టమైన ఆహారం.

తిమింగలం పొట్టలో మనిషి

అత్యంత వింత ఘటన 1891 ఫిబ్రవరిలో జరిగింది. ఆ రోజుల్లో తిమింగలాల్ని వేటాడే ఓడ 'స్టార్ ఆఫ్ ది ఈస్ట్' దక్షిణ అట్లాంటిక్ సముద్రంలోని ఫాక్‌లండ్ దీవుల సమీపంలో ప్రయాణిస్తోంది. దానికి కొంత దూరంలో ఒక భారీ జంతువు నీళ్ళమీద తేలుతూ వస్తూ కనిపించింది. ఓడ కెప్టెన్ తిమింగలం, తిమింగలం అంటూ కేకలు వేశాడు.

వెంటనే రెండు చిన్న పడవుల్ని నీళ్ళలోకి దించి, వాళ్ళు హార్పూన్లతో సముద్ర జంతువులను వేటాడడానికి ఉపయోగించే బాణాల వంటివి కొట్టే ప్రయత్నం సాగించారు. రెండు, మూడు హార్పూన్లు తిమింగలం ఒంటిమీద దిగబడ్డాయి. తిమిగలం రెచ్చిపోయింది. తోకతో విసిరికొట్టే సరికి ఒక పడవ సముద్రంలో తల్లకిందులైంది. ఎలాగో అందరూ ఓడకు సురక్షితంగా చేరారు. అయితే ఓడలోని వారు మాత్రం చివరకు తిమింగలాన్ని చంపేశారు. దాన్ని ఓడతో పాటే ఒడ్డుకు చేర్చారు. దాన్ని జాగ్రత్తగా కోశారు. కోసిన దాని పొట్ట చూసి ఆ ఓడ సిబ్బంది ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచారు. ఎందుకంటే దాని పొట్టలో జేమ్స్ స్పృహ తప్పిపడివున్నాడు. ఆల్‌సుల్ జేమ్స్‌కు వారాల తరబడి వైద్యం చేశారు. క్రమంగా అతను కోలుకున్నాడు. కానీ జేమ్స్ మాత్రం చనిపోయినవాడిలా పాలిపోయాడు. అతని శరీరం జీవితాంతం అలానే వుండిపోయింది. జేమ్స్‌కు గుర్తున్నదాన్ని బట్టి తిమింగలం తోకతో కొట్టాక పడవలోంచి ఎగిరి అతను సరాసరి దాని కడుపులోకి జారిపోయాడు. జేమ్స్ బార్ట్‌లీ కథను మొట్టమొదట ఇంగ్లండ్ నుంచి వెలువడే మెర్క్యురీ అనే పత్రికలో ప్రచురితమైంది.

సర్కస్ ఎలా పుట్టింది?

అనునిత్యం జీవన సమరంతో...సంసార జంఝాటంతో సతమతమయ్యే మనసుకు ఒకింత ఆహ్లాదాన్ని కల్గించి ఊరట కల్గించే ప్రక్రియలు ఎన్నో కనుగొంటున్నాడు మానవుడు. అలాంటి వాటిలో ఒకటి సర్కస్ ప్రదర్శన. ఇది చూసినంత సేపు ఉత్కంఠ కలుగ చేసే ప్రతిభ ఒక్క సర్కస్ ప్రదర్శనకే వుందంటే అతిశయోక్తి కాదేమో! ఈనాడు మనం చూస్తున్న సర్కస్ ప్రదర్శన పూర్వాపరాలు పరిశీలిస్తే దీనికెంత గాథ వున్న సంగతి బోధపడుతుంది. మొట్టమొదటిసారిగా సర్కస్ ప్రాచీన రోమన్లు 'ది సర్కస్ మాకిమ్స్" అనే పేరుతో విశాలమైన ప్రదేశాల్లో నిర్వహించేవారు. ఆప్రదర్శనల్లో రథాలను పరుగెత్తించటం, ఈ పరుగుపందాలు జరుగుతుండగా మధ్య మధ్య విరామ సమయంలో ఈటెలతో విన్యాసాలు చేసేవారు. 18వ శతాబ్దం పూర్వార్ధంలో ఇంగ్లాండ్‌లో నిర్వహించిన "వ్యాన్‌షో" లు దొమ్మరివారు, గారడీవారు సమూహాలుగా వ్యానుల్లో ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి తరలి వెళుతూ ప్రదర్శనలిచ్చేవారు. ఆవ్యాన్లను వారు గ్రీన్ రూమ్స్‌గా వాడుకొనేవారు.

మొట్టమొదటి "యునైటెడ్ స్టేట్స్ సర్కస్" రికెట్స్ అనే ఆయన ద్వారా ఫెలిడెల్ఫియా, న్యూయార్క్‌లలో పద్దెనిమిదవ శతాబ్దాంతంలో జనంలోకి వచ్చింది. అది చిన్న సర్కస్. పందొమ్మిదవ శతాబ్దం పూర్వార్ధంలో అనేక సర్కస్ కంపెనీలు వెలిశాయి. దేశమంతా వ్యాగన్లలో తిరుగుతూ ప్రదర్శనలు ఇచ్చేవారు. అయితే పగటిపూట మాత్రమే జరిగేవి.

1860 సంవత్సరానికి ఈనాడు మనం చూస్తున్న మాదిరి సర్కస్ వ్యాప్తిలోకి వచ్చింది. గుడారాలు ఉపయోగించటం, రాత్రులందు అనేక కొవ్వొత్తుల వెలుగులో ప్రదర్శనలివ్వటం సాధ్యమైంది. విన్యాసకుల సంఖ్య ప్రదర్శన జంతువుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఎప్పటికప్పుడు కొత్త, కొత్త ఆకర్షణీయమైన విన్యాసాలు ప్రదర్శనకు జతచేయబడుతుండేవి. పి.టి. బర్మన్ అనే ఆయన తన సర్కస్ ట్రూపుతో రైలు ద్వారా ప్రదర్శనలనివ్వటం ప్రారంభించారు. ఇంత ప్రాచీన చరిత్ర కలిగివుండి అన్ని రంగాలలో జరుగుతున్న మార్పులు చేర్పులు వల్లనే సర్కస్ రంగంలో కూడా అనేక మార్పులు వచ్చాయి. రష్యన్ సర్కస్ ప్రథమ స్థానం వహించటమే గాక బహుళ జనాదరణ కూడా పొందుతోంది.



కవిత్వమ్

మంచి నీరివ్వలేరా?

- మాధవీ సనారా



పేదల బస్తీల్లోని వాళ్ళు
మిమ్మల్ని మణులడిగారా?
మాణిక్యాలడిగారా?
తాగడానికి గుక్కెడు
మంచినీళ్లే కదా అడిగింది
తాగు నీరివ్వడం పోయి
పందులు దొర్లే
మురికి నీరా వాళ్ల నోట్లో పోసేది.
ఈ మురికి నీరు తాగితే
గరళం మింగిన హరుడు కూడా
'హరీ' అంటాడే.. తీయగా వుండే
నీళ్లు కూడా బాంబుల్లా
ప్రాణాలు తీయడమంటే ఇదే
ప్రాణాలు కాపాడాల్సిన నీరు
ప్రాణాలు తీయడం విడ్డూరమే కదా!
ముక్కు పచ్చలారని పసిపిల్లల మీదికి
కాటికి కాళ్లు చాచుకున్న
ముసలాళ్ళ మీదికి
మురికి నీటి అస్త్రాల్ని సంధిస్తారా?
సారా ప్యాకెట్లివ్వడానికి చేతులొచ్చే మీకు
మంచి నీరందించడానికి చేతులు రావా?
నీరు కూడా కాలపాశమై
చుట్టుకుంటుందని తెలీని
అమాయకుల్ని
మురికి నీటి ముగ్గులోకి దించుతారా?
రెండు పూటలా తిండి ఎలానూ
కాలే కడుపులకివ్వలేరు
కనీసం స్వచ్ఛమైన
మంచినీరైనా అందించలేరా?
ఊళ్లకు ఊళ్ళు
దాహంతో పిడచకట్టుకు పోతున్నపుడు మంచినీరందించలేని మిమ్మల్ని
వీళ్లే మూడు చెరువుల
మంచినీళ్లు తాగిస్తారు
తస్మాత్ జాగ్రత్త ★

బూటూ ఆయుధమే



బూట్లు కూడా ఇప్పుడు నిరసనలకు
గేట్లు తెరిచాయి
గాల్లో ఎగిరే నల్ల బూట్లే
నిరసన జెండాలిపుడు ఒంటిని తాకి రక్తం కారేలా
గాయం చేసినా చేయకున్నా
మనసు మీద తీవ్ర గాయం చేసే
మటాకన్నా బలమైన ఆయుధం బూటు
సమర్థుడ్ని సీటు మీద వుంచడానికైనా
అసమర్థుడ్ని సీటు మీద వుంచడానికైనా
రెండువైపులా పదునున్న కత్తిలాంటి ఓటు
ఐదేళ్ళ కొకసారే ఆయుధమై అవతరిస్తే
ఎప్పుడైనా వచ్చి
ఎత్తిన తల దించుకునేలా చేసే
కొత్త ఆయుధం బూటు
షూ ఇకపై షోకేస్‌లో నుండి శక్తివంతమైన బాంబులా కనిపిస్తుంది
రోమియోల మీద ఆడది తిరగబడినప్పుడు చెప్పుతోనే కదా దాడిచేసేది
మొన్నటి ఆడదాని ఆయుధమే
మగవాడికి తిరుగుబాటు సాధనమైంది నేడు
ఆడదాని పాదాల్నే కాదు
వారి మాన ప్రాణాల్ని సైతం కాపాడిన చెప్పు
మగవాడికి నిరసనాయుధమైందిప్పుడు
మనం విస్మరిస్తే
విదేశీయులు అక్కున చేర్చుకున్న
ఎన్నో వాటిలా ఇప్పుడు
ఈ నిరసనాస్త్రాన్నీ విదేశం నుండి
దిగుమతి చేసుకున్నాం. పాంకోళ్లో.. పాదరక్షలో
పేరేదైతేనేం
రాముడి కాలంలోనే పాదరక్షలు నెత్తినెక్కాయి
సింహాసనం మీద అధిష్టించాయి
చెప్పుల్ని మోసిన భరతులిప్పుడేరీ? దాడికిప్పుడు బూటే గ్రేటని గుర్తించాం
మారణాయుధాలకోసం
జేబులు తడిమే చూపులు
ఇప్పుడిక పాదాల్ని అనుమానిస్తాయేమో! దేవాలయాల్లోకే కాదు
ఇప్పుడిక
విఐపిల ముసుగుల్లో దాక్కునే దొంగనాయకుల సభల్లోకి కూడా
బూట్లు వేసుకెళ్ళడాన్ని నిషేధిస్తారేమో! ★

క్రైమ్ కథ

గాడ్‌ఫాదర్

- యర్నాగుల సుధాకరరావు

పోలీస్ జీప్ ఆఇంటి ముందాగింది. ఇన్‌స్పెక్టర్ స్వరూప్ కిందకి దిగి శిథిలమైన ఇంటి కిటికీ వద్దకు వెళ్లాడు. అక్కడో అమ్మాయి కన్పించింది. చూడగానే నమస్కరించింది. సన్నగా నవ్వుతూనే చుట్టుతిరిగి లోపలికి వెళ్లాడు. "నీపేరు నీరజ! నీవేనా కార్డు రాశావు"

"అవును, నేనే రాశాను. జార్జిని చంపిందెవరో నాకు తెలుసు. మీరు అతను హతుడై నెలరోజులైనా హంతకుడు కోసం వెతుకులాటలోనే ఉన్నారు. నాకు తెలుసుకనుక నేను మీకు పోస్టుకార్డు రాశాను" చెప్పి కూర్చోమని కుర్చీ చూపింది.

ఆమెను నఖశిఖపర్యంతం చూశాడు. ఆమె బాగానే ఉంది. మంచి గొంతు. చెప్పాల్సింది ఏమాత్రం తొణక్కుండా చెబుతోంది. ఆమెకు ప్రధాన లోపం రెండుకాళ్లు చచ్చుపడివున్నాయి. జాలిగా చూసి "నీరజా నీవు నడవలేవు. ధైర్యంగా పోలీసులకు ఒక హంతకుని ఆచూకి చెప్పడానికి ముందుకు వచ్చావు. నిన్ను మెచ్చుకోకుండా ఉండలేం. సరే విషయానికి వద్దాం. జార్జిని చంపిందెవరు?"

"సార్ హంతకుని గురించి చెప్పే ముందు అసలు జార్జికి నాకు ఉన్న పరిచయం మీకు చెప్పాలి. నాకు ఎవరూ లేరు. నాకు నెలసరి మాపెద్దనాన్న పంపే డబ్బుతో రోజులు వెళ్లదీసేదాన్ని. ఆయనమీద ఆధారపడడమెందుకు" అని ఏదైనా జాబ్ చూసుకుందామని నామీద నమ్మకంతో ఇరుగుపొరుగువారి కాళ్లపట్టుకుని వారి సాయంతో ఒక ఇంటర్వ్యూకి వెళ్లాను. అక్కడ ఇలా కాళ్లుచేతులు లేనివారితో సంస్థ నడపలేం. ప్రభుత్వం చేయాల్సినపని ప్రయివేట్‌వారు చేయలేరు అని కాదనేశారు. తిరిగి ఒక ఆటోలో వస్తుండగా ఆటోడ్రయివర్ ఏదో నేరం చేశాడు. అది ప్రూవ్ అయ్యిందని నడుపుతున్న ఆటోను ఆపేసి నన్ను ఫుట్‌పాత్‌మీద వదిలేసి పోలీసులు అతడిని ఆటోతో సహా తీసుకు పోయారు. ఇక ఆవైపు ఏ వాహనం రాకపోవడంతో నేను చాలా భయ పడ్డాను. రాత్రి తొమ్మిదయింది.

పోకిరీవెధవలు మత్తుగా తాగి నన్ను ఏదేదో అంటుంటే నేను హెల్ప్ హెల్ప్ అని అరిచాను. అప్పుడు ఒక అంబాసిడర్‌లో వచ్చాడు జార్జి. వారిని తరిమేసి నాగురించి అడిగాడు. ఎందుకో అతడు నాపట్ల అంతులేని జాలితో ఉన్నట్లు కన్పించాడు. కారులో నన్ను ఎక్కించుకుని నాఇంటిలో దిగబెట్టాడు. అప్పుడు చెప్పాడు. "నాకు నీలాంటి కవల చెల్లెళ్లు ఉండేవారు నాపేదరికం వలన వారికి ఇంత తిండిపెట్టలేకపోయాను. వారు అవిటితనంతో పాతికేళ్ల వయస్సులో చనిపోయారు. నిన్ను చూస్తే వాళ్ల గుర్తుకువచ్చారు" అని చెప్పి వెళ్లిపోయాడు.

ఆతరువాత రెగ్యులర్‌గా పగటిపూట వచ్చేవాడు. నాకు ఇలా అంటే అలా ఒక ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం ఇప్పించాడు. నన్ను బాగా చూసుకోమని పక్కింటివాళ్లను ప్రాధేయపడేవాడు. 'నాచెల్లెలా నీవు కాకూడదు' అనేవాడు. అతడు క్రిస్టమస్ నెలంతా నాకు చాలా కేకులు తెచ్చి ఇచ్చేవాడు. అతడితో ఎవరు వచ్చినా వారికి నాచెల్లెలు అని పరిచయం చేసేవాడు. నీరజ చెబుతుంటే ఇన్‌స్పెక్టర్ స్వరూప్ ఆశ్చర్యంగా వినసాగాడు.

"సార్ మీకు నేను చెప్పింది విస్మయంగా ఉందికదూ. మీ హావభావాలను నేను పసిగట్టాను. సో, జార్జి ఈమధ్య చంపబడ్డాక నన్ను వెంటనే ఉద్యోగంలోంచి తీసేశారు. ఎందుకలా" అని అడిగాను. అందుకు యాజమాన్యం ఒకవిషయం చెప్పింది. స్వరూప్ మరింత క్యూరియాసిటీగా చూశాడు.

"జార్జి నరహంతకుడు. అలాంటివాని సిఫార్సును కాదనలేక నీకు ఉద్యోగం ఇచ్చాం. అయితే నీవు ప్రూవ్ చేసుకున్నావు. నీపనిలో లోపం లేదు. పోలీసులు జార్జిని చంపినవారికోసం వెతుకుతున్నారు. ఏదో రోజు నీకోసం ఇక్కడకే వస్తారు. మేము ఎవరికి భయపడి నిన్ను ఉద్యోగంలోకి తీసుకున్నామని తీగ లాగుతారు. అందుకే నీవు వెళ్లిపో. సద్దుమణిగాక వచ్చేయ్ తీసుకుంటాం" అన్నారు. స్వరూప్ ఈసారి నవ్వేసాడు. ఇంకా చెప్పు అన్నట్లు చూశాడు.

"అంతవరకు జార్జి నరహంతకుడని నాకు తెలియదు. తెలిశాక ఒకింత బాధపడ్డాను. అతడిలో నావంటి అనాథపై జాలిపడే విధానం నాకెంతో నచ్చింది. ఆయన్ని చంపిందెవరా అని రాత్రింబవళ్లు ఆలోచించాను. అతడు నావద్దకు వచ్చేటపుడు ఒకసారి చెప్పడం గుర్తుకువచ్చింది. మనిషికి సమాజంలో మిత్రులున్నట్టే శత్రువులు ఉంటారు. నాకు ఒక దేవుడే శత్రువు. ఏదో ఒకరోజు అతడి చేతుల్లో దారుణంగా చస్తాను" అని చెప్పాడు. దేవునితో శత్రుత్వం అంటే నేను చాలా ఆశ్చర్యపోయాను. ఇంతకీ దేవుడు ఎవరా అని ఆలోచించాను. చివరికి జార్జిమిత్రులు కూడా అప్పుడప్పుడు వచ్చేవారు అని చెప్పాను కదా! వాళ్లు నన్ను చెల్లెమ్మా అనేవారు. వారిలో ఒకరితో ఫోన్‌లో మాట్లాడి జార్జి మిత్రుల పేర్లు చెప్పమన్నాను. అతడు చెప్పాక శత్రువుల పేర్లు అడిగాను. గాడ్‌ఫాదర్ అనే దాదా ఒకడు పాతశత్రువు ఉన్నాడు. వాడు యాక్సిడెంటులో ఒక కాలు విరిగి సాదా సీదా ఆసుపత్రిలో ఉన్నాడని చెప్పారు. వాడు ఎన్నో నేరాలలో శిక్షపడ్డవాడు. జార్జిని చంపే తాను చస్తానని చెప్పేవాడట. జార్జి కూడా వాడిని చూస్తే చంపే వరకు నిద్రపోడు. ఇద్దరూ ఒకరికి దొరక్కుండా ఒకరున్నారు.

స్వరూప్ తల పంకించి "గాడ్‌ఫాదర్ అనే దాదా మీద నీకు అనుమానం అవునా?"

"అవును సార్. గాడ్‌ఫాదర్ యాక్సిడెంటు రోజు తెలుసుకున్న నేను నగరంలో ఆరోజు యాక్సిడెంటు నమోదు అయ్యిందీ లేందీ ఈవీధిలో ఒక కానిస్టేబుల్ ద్వారా వివరాలు సేకరించాను. గాడ్‌ఫాదర్ అలా నమ్మించి జార్జిని చంపేశాడు. అతడెక్కడుందీ వివరాలు నావద్ద ఉన్నాయి. వాడు బార్‌లైసెన్సు డిస్మిస్ అయి మూతపడిన బార్‌లో మకాంవేసాడు. జార్జి దోచినది నావద్ద దాచాడేమోనని ఒకరోజు అర్ధరాత్రివేళ వచ్చి తలుపు తట్టాడు. నేను ఎవరు అని అడిగితే తనపేరు ఏదో చెప్పేసి నీవద్ద మాజార్జి చాలా ధనం దాచాడని విన్నాను. వాడు చచ్చాడు నాకు ఇవ్వవల్సింది ఇవ్వలేదు. నీవద్ద ఉన్నది పడేయ్ అని బెదిరించాడు. అతడి వెనుక ఒక గూండా ఉన్నాడు. మధ్యలో గాడ్ అంటు ఏదో చెబుతుండేవాడు వీడేనా గాడ్‌ఫాదర్ అని అనుకున్నాను. ఇద్దరూ కలిసి ఇల్లంతా వెతికారు. వెళ్లిపోతూ మా రాక గురించి ఎవరికి చెప్పకు. నీకు కాళ్లు ఆదేవుడు తీసేసాడు, ఈదేవుడు నీచేతులు తీసేస్తాడు అని హెచ్చరించి వెళ్లిపోయాడు. వారిమాటల్లో వారు ఎక్కడా ఉన్నది పదేపదే చెప్పుకున్నందున వారినెలవు నాకుతెలిసింది."

"నీరజా నీవు చాలాతెలివైనదానవు.ఎక్కడికి కదలకుండా హంతకున్ని పట్టుకున్నావు. నీ సాక్ష్యాధారాలు మాకు పనికొస్తాయి. గాడ్‌ఫాదర్‌ని పట్టుకుంటాం" అని చెప్పి లేచాడు.

★

అనురాగాల నిండు పున్నమి

రాఖీ...ఈ మాట
వినగానే మనసు ఉద్వేగం
చెందని భారతీయులుండరు.
హృదయం నిండా సంతోషాన్ని నింపి బంధాలు గుర్తుకు
తెచ్చే శక్తి రాఖీ సొంతం. తోబుట్టువుల మధ్య ఉండే
ఆప్యాయత, అనురాగాలకు ప్రతిరూపంగా సోదరుల
ముంజేతి యందు ముప్పేరలు గొలిపే
మహత్తర కంకణం రాఖీ.

- బి.అమరనారాయణ

ప్రతి ఏటా శ్రావణ మాసంలో నిండు పున్నమి రోజున రక్షాబంధన్, రాఖీ పూర్ణిమ, శ్రావణ పూర్ణిమ తదితర పేర్లతో జరుపుకునే ఈ పండుగ తొలి రోజుల్లో ఉత్తర, పశ్చిమ భారతదేశంలో మాత్రమే ఘనంగా జరుపుకునేవారు. క్రమేపి అసేతు హిమాచలమంతటా విస్తరించి సోదరీమణుల మధ్య ఆప్యాయతలను మరింతగా పెంచింది. ప్రపంచీకరణ నేపధ్యంలో భారతీయులు విశ్వమంతా ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఇప్పుడిప్పుడే ఇతర దేశాలకు విస్తరిస్తోంది. ఇది కేవలం రక్తసంబంధీకులైన సోదరి, సోదరులు మాత్రమే జరుపుకునే పండుగ కాదు. సోదరభావం ఉన్న ప్రతి ఒక్కరూ జరుపుకునే పండుగ.

పౌరాణిక గాథల్లో రాఖీ

హిందూ పురాణాలలో ఈ పండుగకు సంబంధించి అనేక కథలు వ్యాప్తిలో ఉన్నాయి. వాటిలో కృష్ణ-ద్రౌపది కథ ప్రాచుర్యం పొందింది. శిశుపాలుడిని వధించిన అనంతరం రాజసూయ యాగం చేసే సందర్భంలో కృష్ణుడి వేలికి గాయమై రక్తం కారుతుంది. దీన్ని చూసిన ద్రౌపది వెంటనే తన పట్టు చీర చించి రక్తం కారకుండా కృష్ణుడి వేలికి చుడుతుంది. 'నేడు నీవు చేసిన ఈ సాయానికి అనేక రెట్లు రుణం తీర్చుకుంటాను చెల్లెమ్మా' అంటూ కృష్ణుడు ద్రౌపదికి మాటిస్తాడు. కొద్దికాలం తర్వాత జూదంలో ధర్మరాజు ఓడిపోయి, దుశ్శాసనుడు నిండు సభలో ద్రౌపది చీర లాగేందుకు ప్రయత్నించినప్పుడు తన మాయతో కృష్ణుడు ద్రౌపది చీరను పెద్దదిగా చేస్తాడు. చీరలు గుంజిగుంజి దుశ్శాసనుడు పడిపోతాడు. తర్వాత జరిగిన కథ తెలిసిందే. నాడు ద్రౌపది కృష్ణుడికి చుట్టిన పట్టుచీర పీలికే కాలక్రమంలో రాఖీగా రూపాంతరం చెందిందంటారు పెద్దలు. కృష్ణ-ద్రౌపది కథ కంటే ముందు యముడు-యమున, బలి-లక్ష్మీదేవి, ఇంద్రుడు-ఆయన భార్య సచి సబంధిత కథల్లోనూ ఈ రాఖీ ప్రస్తావన ఉంది. ఇక చారిత్రకంగా చూస్తే యుద్ధంలో తన భర్తకు హాని చేయొద్దంటూ అలెగ్జాండర్ భార్య- నాటి పంజాబ్ రాజపుత్ర రాజుకి రాఖీ కట్టినట్లు చెబుతారు. అలాగే చిత్తూరు రాణీ కర్ణవతి తనను తమ శత్రువైన గుజరాత్ సుల్తాన్ బహదూర్ షా నుంచి రక్షించమని కోరుతూ హుమాయున్ చక్రవర్తికి రాఖీ పంపినట్లు కథనాలున్నాయి.

రవీంద్రుడి సందేశం

1905 నాటి బెంగాల్ విభజన సమయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఓ మహోన్నతమైన సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. ఇలాంటి క్లిష్టసమయాల్లో హిందూ-ముస్లింలు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని సోదరభావం పెంపొందించుకోవాలని ఆనాడు రవీంద్రుడు ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని రగిలించారు. ఇలా భారతీయ జీవనశైలిలో తనదంటూ ఓ ప్రత్యేక ముద్రను వేసుకుంది రక్షాబంధన్. కాలగమనంలో సాంప్రదాయాలలోనూ, ప్రజల జీవనశైలిలోనూ సరికొత్త మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రపంచీకరణ వింత పోకడల వల్ల పండుగలు, పబ్బాలకు ఆధునికత అలవడింది. సహజత్వం స్థానే కృత్రిమత్వం పురుడు పోసుకుంది. ఈ రాఖీ రూపురేఖలూ మారాయి.

అనుబంధం @ అంతర్జాలం

తొలినాళ్లలో ఉన్న ఉమ్మడి కుటుంబాలు నేడు కానరావు. బంధువులంతా దగ్గరిదగ్గరి ఊళ్లలోనే ఉండేవారు. అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు, ఇంటి వద్దే ఉన్న అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీ కట్టడానికి ఆరోజుల్లో పక్షం రోజుల ముందే ఏర్పాట్లు చేసుకునేవారు. అన్నకు చెల్లెలు రాఖీ కట్టి ఆశీస్సులు పొందితే, అక్క తమ్ముడి ముంజేతికి రాఖీ చుట్టి ఆశీర్వదించేది. ఈ సహజ అనురాగానుభూతి మాటలకందదు. కానీ ఈనాడు ఆ అనుభూతి ఆమడదూరంలో ఉండిపోతోంది. పొట్టకూటి కోసం పల్లెలు వదిలి పట్నాలకు వెళ్లిన సోదరసోదరీమణులు కొందరైతే, ఉన్నత ఉపాధికోసం ఖండాంతరాలు దాటిన వారు మరికొందరు. ఇలా దూరాభారంలో ఉండే తమ ఆప్తులకు నిన్నా, మొన్నటి వరకూ పోస్టులో గ్రీటింగు కార్డులు పంపో, ఫోన్లో పలకరించో శుభాకాంక్షలు తెలిపేవారు.

ఇంటర్నెట్ (అంతర్జాలం) ప్రవేశంతో నేడు ఇ-మెయిల్, ఇ-కార్డ్స్ పంపుతూ ఆనందపడుతున్నారు. వెబ్ ఛాటింగ్‌ల ద్వారా కంప్యూటర్ తెరలపైనే తమ ఆప్యాయత పంచుకుంటూ అనురాగాన్ని పెంచుకుంటూ సంతోషిస్తున్నారు.





మరికొందరు ప్రపంచంలో ఏ మూలన ఉన్నా ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా బహుమతులు పంపుతూ తమ తమ బంధువులను అబ్బురపరుస్తున్నారు. సరిగ్గా ఇదే ట్రెండ్‌ను దృష్టిలో ఉంచుకొనే ప్రత్యేక వెబ్‌సైట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. 'మా ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా మేము అంతర్జాతీయ సరిహద్దులను తాత్కాలికంగా చెరిపేశాం. సోదరసోదరీమణులు ప్రపంచంలో ఏ మూలనున్నా వారి అనురాగాన్ని పంచుకునేందుకు వీలుగా వారికి వారే స్వతహాగా ఎంచుకున్న వ్యక్తిగత రాఖీలు, కానుకలను, మిఠాయిలను పంపే ఏర్పాటు చేశాం' అని రెడిఫ్ షాపింగ్ వెబ్‌సైట్ నిర్వాహకులు తమ ప్రత్యేక రాఖీ పోర్టల్ (www.rakhi.rediff.com)లో పేర్కొన్నారు. ఇలాంటి అభిప్రాయాన్నే రాఖీ ఇండియా వెబ్‌సైట్ నిర్వాహకులు కూడా తమ సైట్ (www.rakhiindia.com)లో పొందుపర్చారు. అవును మరి అనురాగం అంగడి సరుకైంది.

రాఖీ సమాచారన్నందించే మరికొన్ని వెబ్‌సైట్‌లు

www.raksha-bandhan.com
www.rakhi.indiangiftsportal.com
www.rakhi-gifts.com
www.en.wikipedia.org/wiki/Raksha_Bhandan
www.rakhi-greetings.com/
www.theholidayspot.com/rakhi/
www.shopping.surfindia.com/rakhi-gifts

రాఖీలు రకరకాలు

పట్టుదారాల రాఖీ : పంజాబ్‌లో తయారు చేస్తారు. పట్టుదారాలతో రూపొందించే ఈ రాఖీలు కాంతివంతంగా ఉంటాయి.

వెండి రాఖీలు : మధ్యతరగతి కన్నా కాస్త పైస్థాయి సంపన్నులు వినియోగించే ఈ రాఖీలకు గుజరాత్ ప్రసిద్ధి. ఎల్లవేళలా ధరించేందుకు వీలుండే ఈ రాఖీలు బ్రాస్‌లెట్‌ను తలపించేలా వివిధ ఆకృతులలో లభిస్తాయి.

కార్టూన్ రాఖీలు : మిక్కీమౌస్, డొనాల్డ్ డక్, స్పైడర్‌మ్యాన్ వంటి పేరొందిన పాత్రలతో రూపొందించిన ఈ రాఖీలకు చిన్నారులు ఇట్టే ఆకర్షితులైపోతారు. ముంబయి నగరం వీటికి ఖ్యాతిగాంచింది.

గంధపు రాఖీలు : సువాసనలు వెదజల్లే ఈ రాఖీలకు సుగంధ రాజధాని మైసూరే మూల కేంద్రం. గంధపు చెక్కతో రూపొందించే ఈ రాఖీలకు సుగంధపు తైలాన్ని నలువైపులా పూసి సువాసనలు వెదజల్లేలా రూపొందిస్తారు.

జరీ రాఖీలు : ఈ రాఖీలకు దక్షిణ భారతదేశంలో మంచి గుర్తింపు ఉంది. జరీ పోగులతో రూపుదిద్దుకొనే ఈ రాఖీలు చక్కని డిజైన్లలో లభ్యమవుతాయి.

చేతితో చేసిన రాఖీలు : వీటికి కోల్‌కతా పేరొందిన ప్రదేశం. ఎటువంటి యంత్రాలను వినియోగించకుండా చేతితో అల్లిన ఈ రాఖీలలో సహజత్వం ఉట్టిపడుతుంటుంది.

జూజాకు జేజే!

ఈ సంవత్సరం హాట్ కేకులా అమ్ముడుపోతున్న రాఖీ ఏదైనా ఉందా అంటే అది కచ్చితంగా 'జూజా(ZOO ZOO)' రాఖీయే. ఈ జూజా రాఖీలకు చిన్నారులు జేజే అంటున్నారు. దక్షిణాఫ్రికాలో ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా ఓ మొబైల్ సంస్థ రూపొందించిన జూజా ప్రకటనలకు విశేషమైన గుర్తింపు లభించింది. ఇదే థీమ్‌తో రూపొందించిన జూజా రాఖీలకు మహా గిరాకీ లభిస్తోంది. 'టీవీలో హల్‌చల్ చేసిన జూజా పాత్రలు మా తమ్ముడికి ఎంతో ఇష్టం. వాడిని మరింత సంతోషపెట్టేందుకు జూజా పాత్రలతో రూపొందించిన రాఖీలను తీసుకెళ్తున్నా' అని ముంబయిలో ఈ రాఖీలను కొనగోలు చేసిన ఓ సోదరి ఆనందం వ్యక్తం చేస్తోంది. 'ఈ ఏడాది రాఖీల్లో జూజాదే అగ్రపీఠం. జూజా తర్వాత అమెరికన్ వజ్రాలు, ఆస్ట్రియన్ తళుకులతో రూపొందించిన రాఖీలకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. వీటితోపాటే చైనా, కొరియా రాఖీలకు కూడా చక్కటి గిరాకీ ఉంటోంది. మిఠాయిలతో రూపొందించిన రాఖీలు కూడా విశేషంగా ఆకట్టుకుంటున్నాయి' అని ముంబయిలోని ఓ రాఖీ దుకాణదారు సంతోషం వెలిబుచ్చుతున్నాడు.

ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరు

మన రాష్ట్రంలో 'శ్రావణ పూర్ణిమ'గా పిలుచుకునే ఈ రాఖీ పండుగను దేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో ఘనంగా జరుపుకుంటారు.

రాఖీ పూర్ణిమ : ఉత్తర, పశ్చిమ భారతదేశం

అవని అవిట్టమ్/ఉపకర్మన్ : తమిళనాడు, కేరళ తదితర దక్షిణ భారత ప్రాంతాలు

నారియల్ పూర్ణిమ : మహారాష్ట్ర, గుజరాత్, గోవా, కర్ణాటక

పవిత్రోపన : గుజరాత్

కజరాయి పూర్ణిమ : మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌ఘఢ్,

విదేశాల్లోనూ...

భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో రాఖీ పండుగ జరుపుకుంటారు. పొరుగున ఉన్న నేపాల్ తదితర ఆసియా దేశాలతో పాటు అనేక దేశాల్లో ఈ పండుగ జరుపుకుంటారు. యూరప్, గల్ఫ్ దేశాల్లోనూ, ఆస్ట్రేలియాలోనూ అక్కడ నివసిస్తున్న ఆసియా వాసులు తమ తమ ప్రాంతాల్లో ఈ పండుగ రోజు సంబరాలు చేసుకుంటారు. అమెరికా, బ్రిటన్‌లోని భారతీయులూ అత్యంత ప్రాధాన్యతతో రాఖీ పండుగ చేసుకుంటారు.

కంధమాల్, ఒరిస్సాలో చోటుచేసుకున్న మతఘర్షణలు, ముంబయిలో ఉగ్రవాద ముష్కరుల మారణహోమం, మన రాష్ట్రంలో మహిళలపై ఎన్నడూ లేనంతగా చోటుచేసుకుంటున్న హత్యలు, అత్యాచారాలు, ర్యాగింగ్ భూతం వంటి సామాజిక సమస్యలు నెలకొన్న నేటి తరుణంలో ఈ రాఖీ పండుగ సోదరభావాన్ని ఇనుమడింపజేసి సామాజిక స్పృహ పెంపుదలకు దోహదపడుతుందని ఆశిద్దాం.

(నెట్ కథనాల ఆధారంగా)

★

పిల్లకాకి

శ్రీలత

అదో కొబ్బరితోట. మిట్ట మధ్యాహ్నం మండుటెండను కొబ్బరాకులు ఫిల్టర్‌చేసి చల్లగా మార్చి నేలపై నీడలు పరుస్తున్నాయి. ఆ నీడల్లో కూర్చుని గట్టు కనబడని తన పొలం నలువైపులా చూపు సారించి చూస్తూ తనతో కూర్చున్న కరణంతోనూ ఇన్‌స్పెక్టర్‌తోనూ కులాసాగా కబుర్లు చెబుతున్నాడు పెదరాఘవయ్య. ఉతికి గంజి పెట్టిన ఇస్త్రీ పంచె పైన తెల్లని లాల్చీ, ఆ పై తెల్లని కండువాతో పెద్దమనిషిలా ఉంటాడు.

"అసలు పెద్దమనిషిలా కనిపించకపోతే పెద్దమనిషని అందరూ ఎలా గుర్తు పడతారు? అలా గుర్తుపట్టలేకపోతే తనను చిన్న మనిషిగా భావించి తను చేసే పనులన్నింటినీ ప్రతి బేకారు వెధవా విమర్శించకుండా ఎలా ఉంటాడు?" అని తన పెద్ద మనిషి గెటప్‌కు తనను తాను సమర్థించుకుంటాడు. గ్లాసుల్లో మందు పోస్తున్నాడు కరణం.

"అసలు ఈ సెంటిమెంట్లనేవి చాలా బలమైనవనిపిస్తోందోయ్ నాకు" అన్నాడు ఐస్ ముక్కలేస్తూ .... చికెన్ సిక్స్‌టీఫైవ్‌ముక్కను చూస్తూ...

"అంతేనంటారా.." అన్నాడు ఇన్‌స్పెక్టర్. యూనిఫాంలో ఉండి.. హ్యాట్ పెదరాఘవయ్య కాళ్ళ దగ్గర పడేసి... చేతిలో స్టిక్‌ను ఆయన వీపు గోక్కోవడానికిచ్చి.. తీరుబాటుగా కూర్చుని... తనూ ఓ చికెన్‌ముక్కను కొరుకుతూ. ఎదురుగా కూర్చున్న కరణం మాట్లాడలేదు.

"మరి లేకపోతే .. నిన్న బలవంతం.. అదేనయ్యా రేపు..చెయ్యబోతూంటే.. యానాది రంగమ్మ ఏవందీ...? నేను మా మావకే అంకితమయిపోనానండీ.. నన్ను సెడపమాకండీ... మీ కాళ్ళట్టుకుంటాను అన్లా. మరది సెంటిమెంటే కదా... డబ్బులూ... పెద్దరికం ఉన్న నాలాంటి పెద్దోళ్ళు... డబ్బుల్లేని ఆడాళ్ళకి మావలయిపోతారని తెలీదా దానికి? కాకపోతే దాని సెంటిమెంటు దాన్ది. అది బలమైంది కాబట్టే.. దీన్నేమీ చెయ్యలేక పోయాను" అని చికెన్ ముక్క నోట్లో పెట్టుకుని చప్పరించాడు. తను రేపెందుకు చెయ్యలేక పోయాడో వివరంగా.

"ఇక్కడ...సెంటిమెంటుకన్నా రంగమ్మ బలమైందేమోనండి. అందుకే చీర కొంగు దోపేసి.. తవర్ని చితక్కొట్టి.. పారిపోయింది" అని నాలుక్కరుచుకున్నాడు.

అసలిలా నిజాలు చెప్పకూడదనుకుంటాడు. కానీ ఆగలేదు. అందుకే తన వీక్‌నెస్ ఒప్పుకుంటూ...

"నా చేత ఎక్కువ తాగించమాకండి. అన్నీ నిజాలు చెప్పేస్తాను" అన్నాడు. ఉరిమి చూడబోయిన పెదరాఘవయ్య ఎక్స్‌ప్రెషన్ మార్చేసి. ప్రసన్నంగా పెట్టి... "అయితే తాక్కు. అది పారిలేదు. నేనే దాని సెంటిమెంట్‌కు కట్టుబడి వదిలేశా. ఒప్పుకుంటావా?" అన్నాడు.

"ఈ రోజు ఆల్రెడీ డోసు ఎక్కువయిపోయిందండి. అన్ని నిజాలే వస్తాయి. ఎప్పుడయినా తక్కువ తాగినపుడు అడగండి ఒప్పుకుంటా.." అన్నాడు.

అంత పెద్ద నౌకర్ని అలవోకగా క్షమించేశాడు పెదరాఘవయ్య. ఎందుకంటే పెదరాఘవయ్యకు నిజమైన రక్షకభటుడు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్. అతను చేసే నేరాలన్నింటినీ క్షమించేసి.. పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ వరకూ రాకుండా చూసుకునేది అతనే కాబట్టి. వాళ్ల దృష్టినీ, సంభాషణనీ మారుస్తూ

'మా నాయన అగపడ్డాడా సారూ " అని కీచు గొంతుతో పిల్లకాకిలా అరుపు వినబడితే తలలు తిప్పారు.

ఆ పిల్లకాకి పేరు జానకి. జానికి జీరయ్య కూతురు. జీరయ్య పెదరాఘవయ్య జీతగాడు. అదీ వాళ్ళ అడ్రస్.

జీరయ్యకు రోజూ రెండు పూటలకు సరిపడా అన్నం తెస్తుంది జానకి. ఆ అన్నం తిని నాలుగుపూటలా పెదరాఘవయ్యకు తన బాకీ తీర్చేందుకు వెట్టిచాకిరీ చేస్తూంటాడు. జీరయ్య తను అన్నం తేకపోతే తండ్రికి పస్తేనని ఆ పిల్లకాకికి తెలుసు. అందుకే ఎలాగయినా తండ్రికి సద్దిమూట ఇచ్చిగానీ ఇంటికి వెళ్లదు.

ఆ పిల్లను ఎగాదిగా చూశాడు కరణం. గాడిదపిల్లయినా సరే ఆడది అయితే చాలు అలాగే చూస్తాడు.

"మీనాన్నేమయినా ఊరిమధ్యలో విగ్రహమా ఎటెళ్ళినా కనపడ్డానికి! మాకగపడ్లేదు" అని చీత్కరించేసి... చేత్తో

"ఎల్లెల్లు" అని సైగ కూడా చేశాడు. జానకి అడుగు కూడా కదపలేదు. కాళ్ళు భూమిలో ఘాతం వేసినట్లు స్థిరంగా నుంచుంది. పైగా కీచుగొంతు సరిచేసుకుంది.

చింపిరి జుట్టు, మోకాళ్ల కిందకు లంగా, మూరెడు జాకెట్టు... జాకెట్టుకూ లంగాకూ మధ్య గుంటపడని బొడ్డూ... పసితనాన్ని చూపుతున్నాయి. అమాయకంగా ఉన్న మొహం ఆరిందాలా పెట్టి...

"ఊళ్ళోవాళ్ళు మా నాయన పొద్దుననంగా ఈడికి వచ్చుండాడని చెప్పారండి. అందుకే అన్నవట్టుకొచ్చేసేను. పొద్దుట్నుంచీ మా నాయన ఏవీ తిననేదండి. మా నాయన అగపడ్డాడా సారూ" అని మళ్ళీ కీచుగా అడిగింది.

పెదరాఘవయ్య నొసలు చిట్లించుకున్నాడు. ఆ నొసలు అలాగే ఉంటే అనర్థం జరిగిపోతుంది. అందుకే అది ఆపాలని.. ఎదురుగా టీపాయ్ మీదున్న పట్టా పుస్తకం చేతికిచ్చి..

"ఇది కాస్త చూడండి..." అన్నాడు కరణం.

"అది జీరయ్య భూమి పట్టా గదంటయ్యా" పెదరాఘవయ్య అడిగాడు.

" జీరయ్య...మా అయ్యండి. మా నాయన అగపడ్డాడా సారూ?" ఆనందంగా అడిగింది జానకి. గబగబా ఆపిల్ల దగ్గరకొచ్చి.. రెండు జడలూ కలిపి పట్టుకుని, దూరంగా తీసుకెళ్ళి కూలేసి ... చేతిలో డబ్బా లాక్కుని ఒళ్లో పెట్టి...

"తింటూ కూర్చో. మీ నాయన మాకు అగపడ్లేదు" అని చెప్పి మళ్ళీ పెదరాఘవయ్య దగ్గరకొచ్చాడు కరణం.

"పట్టా పుస్తకం మీద మన భారతదేశం చాలా గొప్పది అని రాసుందేవిటి కరణం? అంత గొప్పదంటావా" అనడిగాడు రాఘవయ్య,

"కాదంటేటండి? మనందరం.. ఈ నేల్లోపుట్టి.. ఆ నేల పండించిన గింజలు తిని బ్రతుకుతూ ఆ నేలనే తన్నుతూ.. ఆ నేలనే ఏలడం లేదటండీ?" అన్నాడు ముక్కు గోక్కుంటూ తాపీగా.

"అన్ని నేలల్లో అందరూ.. అంటే ప్రపంచమంతా అట్లాగే సేత్తున్నారులేవో.

ఎవడి భూమి వాడికి గొప్పదయితే లాభం ఏంటీ? ఒకడి భూమి ఇంకొకడికి గొప్పదవ్వాలి. అప్పుడు పక్కోడికి ఈర్ష్య పుట్టాల. అది దక్కించుకోవడానికి యుద్ధాలు సెయ్యాల. అమెరికా సామ్రాజ్యవాదం అట్టాగే ఇస్తరిల్లింది. మనం గూడా భారతదేశం పట్టా పుస్తకాల మీద భారతదేశంకన్నా ఏరే దేశాలు గొప్పవని రాత్తే... అందరికీ ఏరే దేశాలు ఆక్రమించుకోవాలనిపించి.... ఆ వైపు ఆలోచనలు సేత్తారు. మన దేశ విస్తరణ పెరిగిపోద్ది..." అని ఆగి కరణం వైపు చూశాడు.

'తన రెండొందల ఎకరాలు అలాగే విస్తరించుకున్నారు మరి' అని గొణిగి నాలుక్కరుచుకుని 'భలే బాగా చెప్పారు' అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోవడానికి లేచాడు. వాళ్ళకు వెనగ్గా గుమ్మంలో కీచుగొంతు జానకి వయసే ఉన్న పెదరాఘవయ్య కూతురు పట్టులంగాతో పాలబుగ్గలతో నిండు బొద్దుగా ఉన్న ఒళ్ళు, మొహంలో ఆనందపు నవ్వు కలిపి గుమ్మడి పువ్వులా ఉంది. పెదరాఘవయ్యకు వయసు మీరాక పుట్టినందుకు మరీ గారాల పట్టయినట్లు గర్వంగా కూడా ఉంది. గుమ్మడిపూవు కీచుగొంతును చూసి స్నేహంగా పలకరింపుగా నవ్వింది. కీచుగొంతు నవ్వలేదు. పైగా

"గొంతు చించుకుని మా నాయన అగుపడ్డాడా సారూ" అని మళ్లీ పిల్లకాకిలా అరిచింది.

ఎస్పి.కి కోపమొచ్చింది. లాఠీ తీసుకుని జాడించాడు. ఆ లాఠీ ఇంతకు ముందు జీరయ్య వీపు మీద తాటించాడు. జీరయ్య తాలూకు రక్తపు జీరకూడా దానికి అంటుకునే ఉంది.

అదేమీ గమనించకుండా..."మా నాయన అగుపడ్డాడా సారూ..." అని గొణిగింది.

" అగుపడలేదు! ఇక అగుపడడు." అనరచి జీరయ్య కోసం తెచ్చిన చద్ది మూట లాక్కుని లాఠీ కర్రకు తగిలించి విసిరేసి...

"మీ అయ్యకు పిండం పెట్టేశాం... పో.. కాకులు తింటున్నాయి. చూడు మీ అయ్య కూడు" అనరచి వెళ్ళిపోయాడు.

అతని వెనకే కరణం, పెదరాఘవయ్య లేచి వెళ్తూంటే... చూస్తూ నిలుచుంది.

గుంపుగా కాకులు చేరి వెదజల్లి పడ్డ సద్దిని ఏరుకుని తినేయడం చూసి, "మా నాయన కూడు... కాకులు తినేత్తన్నాయి. ఉస్.. ఉస్.." అని వాటిని తోలి గిన్నె వెతుక్కునే సరికి ఒక్క ముద్దకూడా మిగల్లేదు. చుట్టూ వెతికింది. దొడ్డంతా తిరిగింది. ఎక్కడా జీరయ్య కనపడలేదు. చూసి... చూసి.. పెదరాఘవయ్య ఆవరణలోంచి గూడానికి లగెత్తుతూ బయలుదేరింది. ఊరికీ గూడానికి మధ్య విస్తారంగా పరుచుకుని ఉన్న సుబాబుల్ పొలాలు దాటుతూ.. కొద్దీ దూరంలో ఆగిన పెదరాయుడి జీపును చూసి దగ్గరగా వెళ్ళింది.

"జీరయ్యను కూడా కలిపారా లేదా!" అన్న పెదరాఘవయ్య మాట విన్నది.

"మనం అనుకున్న అందరూ ఉండారు" అన్న ఖాకీ డ్రెస్ సమాధానం విన్నది.

తండ్రి పేరు వినగానే.. ఎవరికంటా పడకుండా చెట్లను చాటు చేసుకుంటూ ఇంకా దగ్గరగా వెళ్లింది. చీకటి పడటాన ఏదీ స్పష్టంగా కనపడడం లేదు.

జీప్‌లోంచి నాలుగు టార్చిలైట్లు వెలగడం చూసింది. ఆ వెలుతుర్లో కట్టేసిన ఆరుగురు మనుషులున్నారు. ముఖాలు కనిపించలేదు. ఆకారాల్ని బట్టి ఒకరిద్దర్నీ పెదరాఘవయ్య దగ్గర అంతకు క్రితం పనిచేసిన జీతగాళ్ళుగా గుర్తుపట్టింది.

ఆ తర్వాత కాసేపటికి ఖాకీ చేతిలో రైఫిల్ మోగడం... రక్తం కారుతూ బిగ్గరగా అరుస్తూ ఆరుగురూ చలనం లేకుండా అవడం.. అందర్నీ కట్టేసిన తాళ్ళు విప్పి తలా ఓ దరికి తీసుకెళ్లి పడవేసి.. వాళ్ళ బొటనవేళ్ళతో కాగితాల మీద ముద్దర్లు వేసుకోవడం గమనించింది. ఏం జరిగిందో ఎందుకు జరిగిందో తెలియని అయోమయంలో పడవేసింది పసివయసు. కానీ రైఫిల్‌ను వాటంగా పట్టుకుని వేళ్ళతో లాగి పేలిస్తే మనుషులు ఎలా చస్తారో తెలిసింది. పరుగెత్తుకుని గుడిసెకెళ్లింది.

మరుసటి రోజు పోలీసులు, పేపరు వాళ్ళు, టీవీ ఛానళ్ల వాళ్లూ తమ వూరు రావడం నాన్నను ఫోటోలు తీయడం చూసింది. పాడెకట్టి తండ్రిని తీసుకెళ్ళడం వరకూ చూసింది. మళ్ళీ వస్తాడనుకుంది. తను సద్ది తీస్కెళ్లొచ్చు అనుకుంది.

ఆ మరుసటి రోజుకూడా "మానాయన అగుపడ్డాడా సారూ?" అని ఎవర్నో అడగడం విన్న ఎవరో....

"మీనాన్న ఎన్‌కౌంటర్లో చచ్చిపోయాడే చింపిరిజుట్టూ" అని పసిపిల్లని చూడకుండా చెప్పేశాడో గ్రామస్థు.

"ఎన్‌కౌంటరంటే ఏంది?" అనడిగింది

"పోలీసులూ నక్సలైట్లూ ఎదురు కాల్పులు చేసుకుంటే అందులో మరణించడం" అని చెప్పాడో చదివీ చదవని గ్రామస్థు.

"పోలీసులెందుకు కాలుస్తారు?" అని కూడా అడిగింది.

"నక్సలైట్‌గా మారి అడవుల్లో దాక్కుని సమాజాన్ని దోచుకుంటూ, బెదిరిస్తూ సేవచేస్తున్నామని తిరిగివాళ్ళను పట్టుకోవడానికి" అని తలతిక్క సమాధానం చెప్పాడింకొకడు.

మరి మా నాయన ఊళ్ళోనే ఉండాడే.. ఎవర్నీ దోసుకోలేదు. ఎవర్నీ బెదిరించలేదు. మరెందుకు సంపారు సారూ? అనడిగింది. కళ్ళల్లో నీళ్ళు తళతళలాడుతుండగా.

"మీ నాయన పెదరాఘవయ్య జీతగాడా" అనడిగాడతను సూటిగా. "అవున్సారూ" అంది

" మీ నాయనకు పొలముందా" అనికూడా అడిగాడతను.

"అయితే ఆ పొలం బాకీ కింద రాసిమ్మని ఉంటాడు. మీ అయ్య ఒప్పుకుని ఉండడు. అందుకే ఎవరో మాజీ నక్సలైట్ల పేరు మీదో ఎన్‌కౌంటర్ సృష్టించబడితే అందులో మీ నాయన్నూ కలిపేసి ఎన్‌కౌంటర్ చేయించి వేలిముద్ర వేయించుకుని ఉంటాడు" అని చెప్పాడతను.

"ఓహో" అనుకుంది. అది ఎన్‌కౌంటరా, హత్యా అని అర్థాలు మాత్రం ఆ చిన్ని బుర్రకు తట్టలేదు. ఎన్‌కౌంటర్ ఎలా చేయాలో మాత్రం స్పష్టంగా అర్థమయింది. తండ్రికై వెక్కివెక్కి ఏడ్చింది.

"బాకీ కింద పొలం రాయమని పెదరాఘవయ్య అడిగిన నాడే పొలం రాసుంటే ఈ రోజు వాడి పెళ్లాంపిల్లలూ దిక్కులేని వాళ్ళయ్యే వాళ్ళు కాదు" అని దినానికి వచ్చిన పెద్దవాళ్ళు అనడమూ విన్నది.

"తండ్రికి తీసుకుపోయిన అన్నం కాకులు తినడం గుర్తొచ్చింది"

" అలాంటిదేనా ఇది" అని అనిపించలేదు.

నలుగురు పిల్లల్ని పోషించడమెలా అని తల్లి బావురుమంటుంటే మేనత్త తనను తీసుకుపోతానని అందరికీ చెప్పడం వింది. తన తండ్రికీ తనకూ ఉన్న అనుబంధాన్ని ఆ చావు తెంపేసినట్లు భావన కలిగింది.

ఆ రోజు సాయంత్రం చీకటిపడ్డాక "ఇప్పుడే వస్తానత్తా" అని బయలుదేరి ఆఖరుసారి పెదరాఘవయ్య ఇల్లు చేరింది.

భయపడకుండా లోగిట్లోంచి మండువాలోకి వచ్చింది. పడక్కుర్చీలో తలవాల్చి నిద్రపోతున్నాడు పెదరాఘవయ్య. జీతగాళ్ళ జాడలేదు. గోడమీద ఎన్‌కౌంటర్ చేసినపుడు చూసినటువంటి గన్ను చూసింది. చప్పుడు కాకుండా టీపాయ్ జరిపి దానిమీదికెక్కి తీసింది...

కవతగాళ్ళను కాల్చినపుడు ఆ గన్ ఎలా పట్టుకున్నారో చూసింది. అలాగే పట్టుకుంది. ట్రిగ్గర్ కనబడింది. నాలుగు వేళ్ళూ కలిపి.. పెద రాఘవయ్య గుండెకు ఆనించి నొక్కిపట్టి కళ్ళుమూసుకుంది. బుల్లెట్ దూకిన చప్పుడుకి ఎగిరి దూరంగా పడి గూడెం వైపు పరుగుతీసింది. బుల్లెట్ చప్పుడుకు దూరాన ఉన్న జీతగాడు వచ్చి శవాన్ని చూసి గొంతునరాలు తెగేలా అరిచాడు.

"పెదరాఘవయ్యను ఎవరో చంపారు" అని ఊరు గోలపెట్టింది.

"ఎవరు చంపారు? ఎవరు చంపారు?" అంటూ గుస గుసలు పోయారు. "పీడాపోయాడు రాబందు" అనుకున్నారు."

"పెదరాఘవయ్యను చంపలేదు. ఎన్‌కౌంటరయ్యాడు. నేనే ఎన్‌కౌంటర్ చేశా" అని పిల్లకాకి దుఃఖంలో వాగుతుందనుకున్నారు. మేనత్త తనను తీసుకుపోతూంటే.. పెదరాఘవయ్య ఇల్లు దాటుతుండగా బండిలోంచి తొంగి చూసింది జానకి. పెదరాఘవయ్య కూతురు బొమ్మనెత్తుకుని గుమ్మంలో నిలుచుంది.

"మా నాన్న కనిపించాడా మీకు?" అని ఎవరినో అడుగుతుంది!

★

కొత్త పుస్తకాలు

బొమ్మ వెనుక మరికొన్ని కథలు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారి పాక్షిక ఆర్థిక సహాయంతో ఈ కథల సంపుటిని ముద్రించారు. కవి అంబల్ల జనార్ధన్ ఈ కథల సంపుటిని ప్రఖ్యాత కథా రచయిత, విమర్శకులు, కవి, నవలా రచయిత సలీం ఈ కథా సంపుటికి ముందుమాటలు రాశారు. దాదాపు 150 పేజీల్లో 21 కథల్ని కవి అంబల్ల అందించారు. నేను తాతనయ్యానోచ్/ స్థిత ప్రజ్ఞత / ఆపద్బాంధవి/ బొమ్మ వెనుక/ బర్కతు / భద్రత/ దండుగు/ ఆక్రందన /పుట్టింటి పట్టుచీర /కొత్త నీరు / చెదిరినగూడు / దొరకునా ఇటువంటిసేవ/ నష్టపరిహారం/ అనురాగ సంగమం / మరో తాబేలు / కుందేలు- విరామం - నేలమీద సాగు / పరాయీకరణీయం/ విచిత్ర గుప్తీయం/ నా కథకు బహుమతొచ్చిందండోయ్/ తూర్పు పడమరైతే లాంటి కథలున్నాయి. ఉత్తర తెలంగాణా మాండలీకంతో, మట్టి వాసనల్తో ఈకథలు, సామాన్యుని గుండెచప్పుళ్ళుగా ధ్వనిస్తాయ్. కుటుంబ అనుబంధాలు, మానవ సంబంధాలు, మైత్రి, సామాజికంశాలు, శ్రామికుల కష్ట సుఖాలు.. అంతస్సూత్రంగా అగుపిస్తాయి. పరాయీకరణీయం (పేజీ 135) కథ చాలా బాగుంది. ప్రపంచీకరణ, సరళీకరణ నేపథ్యాన్ని, బహుళదేశ సంస్థల దోపిడీని చక్కగా రాశారు. - ఔట్ సోర్సింగ్ ముసుగులో యజమానులు చేసే శ్రమదోపిడిని కథలో చక్కగా చెప్పారు. మూడుతరాల్ని చక్కగా చూపారు. పాపయ్య, అంజయ్య, సూరి పాత్రల్లో శ్రామికుల ముఖ్యంగా అ సంఘటిత కార్మిక వర్గ గుండె చప్పుళ్ళు వినిపింపజేశారు. చక్కటి మాండలిక భాషతో "బర్కతు" కథ సాగుతుంది (పేజీ 48). విపుల పత్రికలో ప్రచురణ అయిన టైటిల్ కథ 'బొమ్మ వెనుక' చాలా అసహజంగా అనిపిస్తుంది. వాస్తవంలో నూటికి 98 మంది అమెరికాలో భర్తల అఘాయిత్యాలకు, ఆరళ్ళకు ఆహుతైన వారే! వార్తలు అవే అంశాలను రూఢి చేస్తున్నాయి. కాని ఈ కథలో సాగర్‌ను వేధించి, డబ్బు కోసం మరో పెళ్ళి చేసుకొన్న పాత్రగా రజనిని చూపారు. రజని లాంటి మహిళలు సమాజంలో ఒకరిద్దరు వుంటే 98 మంది భార్యలను కాల్చుకుతినే భర్తలే. ముఖ్యంగా ఎన్.ఆర్.ఐ. అల్లుళ్ళ ఆగడాలు చూస్తూనే వున్నాంకదా! ఈకథ నిరాశ పర్చింది. 'ఆపద్బాంధవి' కథ సమాజంలో విడాకుల దాకా వెళ్ళే జంటలకు చక్కటి పరిష్కారిలా నిలుస్తుంది. సుమిత పాత్రను రచయిత చక్కగా మల్చారు. స్త్రీ స్వశక్తితో నిలబడేలా చిత్రీకరించారు. కోర్టులో విడాకుల దాకా వచ్చి మళ్ళీ భర్తతో కల్సిన తీరు బాగుంది... వలస బతుకుల వ్యధలు - బడుగు జీవుల ఇక్కట్లు వాస్తవ పరిస్థితుల్ని కథానికలుగా అక్షరీకరించిన అంబల్ల జనార్ధన్ అభినందనీయులు. వీరి కలం నుంచి సామాజిక స్పృహ నిండిన మరిన్ని కథలు రావాలి.

బొమ్మ వెనుక మరికొన్ని కథలు
రచన: అంబల్ల జనార్థన్
పేజీలు : 164 -వెల: 100/-రూ
ప్రతులకు : విశాలాంధ్ర, నవోదయ, శ్రీసరస్వతి బుక్ డిపో (ముంబాయి)
శ్రీమతి అంబల్ల సువర్ణ, బి, 204 ధీరజ్ కిరణ్ -రెండవ అంతస్తు,
ముంబాయి - 400 064. ఫోన్ : 9987533225- 9867667926

- తంగిరాల చక్రవర్తి

త్రినేత్ర (కవితలు)
రుద్రాక్షల మఠం ప్రభులింగ శాస్త్రి
వెల : 51/-, పేజీలు : 66,
ప్రతులకు :
శ్రీనాయని బాగన్న గౌడ్,
స్వరలహరి కల్చరల్ అకాడమి,
మహబూబ్ నగర్.





సూర్యచంద్ర నమస్కారాసనాలు
యోగాచార్య యస్.సంపత్ కుమార్
వెల : 20/-, పేజీలు : 56,
ప్రతులకు :
శ్రీబాలాజీ పబ్లికేషన్స్
33-3-31, రామానాయుడు వీధి,
సీతారామపురం, విజయవాడ.

1857- స్వాతంత్ర్య పోరాటము
ఆంగ్లమూలం : షాజీషహదత్- షాజీ విరాసత్
స్వేచ్ఛానువాదం: రుద్రాక్షల మఠం ప్రభులింగ శాస్త్రి
వెల : 51/-, పేజీలు : 24,
ప్రతులకు : శ్రీనాయని బాగన్న గౌడ్,
స్వరలహరి కల్చరల్ అకాడమి,
మహబూబ్ నగర్.

బెజ్జమహాదేవి (నాటకం)
రుద్రాక్షల మఠం ప్రభులింగ శాస్త్రి
వెల : 51/-, పేజీలు : 84,
ప్రతులకు : శ్రీనాయని బాగన్న గౌడ్,
స్వరలహరి కల్చరల్ అకాడమి, మహబూబ్ నగర్.
మరియు ఎస్.వి. అంజిరెడ్డి, ఇం.నెం.7-9, టీచర్స్ కాలనీ, అంజనాద్రినగర్, మహబూబ్‌నగర్.





స్నేహమంటే ...

ఇదే.

మైత్రి ముందు జాతివైరం 'హుష్ కాకి' అవ్వాల్సిందే.
అరుదైన ఈ చిత్ర రాజాలను చూశాక
ఆ మాటకు ఎవరైనా తలాడించాల్సిందే.
ఇంత మంచి దృశ్యాలను మన ముందుంచిన అపరిచిత ఫొటోగ్రాఫర్లకు
సెల్యూట్ చెయ్యాల్సిందే.



OK

అలీబాబా 40 దొంగలు

జరిగిన కథ:

అలీబాబా కట్టెలకోసం అడవికి వెళ్తాడు. అక్కడ అతను దోపిడీ దొంగల గుహ చూస్తాడు. వారు దోచుకొచ్చినదంతా అక్కడే దాచుకోవడాన్ని కూడా గమనిస్తాడు. అయితే గుహ ద్వారం తెరుచుకోవడానికి, మూసుకోవడానికి మాత్రం రెండు మాటలను మూడు సార్లు పలకాలి. వాటిని జాగ్రత్తగా గుర్తుంచుకున్న అలీబాబా గుహ లోపలికి వెళ్తాడు. గోతాలతో బంగారం, నగలు, నాణేలు నింపుకుంటాడు. ఇల్లు చేరాక భార్యకు జరిగినదంతా చెప్తాడు. సొమ్మును లెక్కగట్టి దాచిపెట్టాలనుకుంటారు. ఆ తర్వాత...

✦ ✦ ✦

అలీబాబా, అతని భార్య కలిసి మానికతో ధనాన్ని కొలుస్తారు. వాటిని తృప్తిగా చూసుకుని దాచిపెడతారు. తర్వాత తోడికోడలి దగ్గర తీసుకొచ్చిన మానికను తిరిగి ఇచ్చేస్తుంది అలీబాబా భార్య. మానిక అడుగున మెత్తిన చింతపండుకు అతుక్కుని బంగారు నాణెం ఒకటి మెరుస్తూ కనిపిస్తుంది. 'ఏరోజుకారోజు తిండిగింజలకు కూడా మొహం వాచే వారికి బంగారు నాణెం ఎక్కడిదబ్బా' అనుకుంటుంది తోడికోడలు. భర్త రాగానే అంతా వివరించి అసలు విషయం కనుక్కోమని పోరుతుంది. ఏనాడూ తమ్ముడి మంచీచెడూ పట్టించుకోని కాశింకు ఇది ఇబ్బందికరంగానే వుంటుంది. కానీ భార్య గోల పడలేక తమ్ముడ్ని కలిసి విషయం అడుగుతాడు. అలీ మొదట విషయం దాట వేస్తాడు. కానీ మానికలో అతుక్కున్న బంగారు నాణేన్ని చూపించి అడిగేసరికి తప్పక అంతా చెప్పేస్తాడు. కాశిం గబగబా ఇంటికి వెళ్లి భార్యకు చెప్తాడు. ఇద్దరూ ఆలోచించుకొని ఒక పథకం వేస్తారు. ఏకంగా మూడు గాడిదలు, గోతాలు తీసుకుని అడవికి బయలుదేరతాడు కాశిం. తమ్ముడు చెప్పిన ప్రకారం దొంగల గుహ దగ్గరకు చేరుకుంటాడు.

గుహను చూసేసరికే అతనికి వెర్రి సంతోషం కలుగుతుంది. అక్కడ వున్న సంపదంతా సొంతం చేసుకోవాలన్నంత ఆశ పుడుతుంది. రెండు చేతులూ చాచి తమ్ముడు చెప్పినట్టుగానే "బీబీ బీగం రాస్తా చోడో" అంటాడు మూడు సార్లు. మెల్లగా గుహ ద్వారం తెరుచుకుంటుంది. ఒక్కపరుగున లోపలికెళ్లిన కాశింకు బోలెడంత బంగారం, డబ్బు, నగలు, విలువైన వజ్రాలు కనిపిస్తాయి. వాటిని చూచిన ఆనందంలో నోట మాట రాకుండా శిలా విగ్రహంలా అయిపోతాడు. తర్వాత ఎప్పటికో తేరుకొని వెంట తీసుకొచ్చిన గోతాల నిండా వాటిని నింపేస్తాడు. వాటిని గాడిదల మీదకు ఎక్కిస్తాడు. అయితే గుహ ద్వారం మూసేందుకు పలకాల్సిన మాటను మర్చిపోతాడు. సమయం గడిచేకొద్దీ కాశింకు తిక్కతిక్కగా అయిపోతుంది. గుహ తలుపు మూసేసి వెళ్లిపోవాలన్న ఆరాటంలో అతను వెర్రి కేకలు వేస్తాడు. కిందపడి కొట్టుకుంటాడు. ఈలోగా దొంగలు రానే వస్తారు. కాశింను, అతని గాడిదలను, వాటి వీపులమీదున్న మూటలను చూసిన దొంగల నాయకుడికి విపరీతమైన కోపం వస్తుంది. రెండో ఆలోచన లేకుండా కాశింను పొడిచిపారేస్తాడు. ఈలోగా మరొకడు అతని తల నరికేస్తాడు. కాశిం మొండాన్ని, తలను గుహలోనే వేళ్లాడదీశాకగానీ వారి కోపం చల్లారదు. తర్వాత బిర్యానీ తిని, ఫుల్లుగా మందు వేసుకుని దోపిడీలకు వెళ్లిపోతారు.

❀ ❀ ❀

కాశిం భార్య అతగాడికోసం ఎదురుచూస్తుంటుంది. ఎంతకీ రాడాయె. ఇక చేసేది లేక అలీబాబా సాయం కోరుతుంది. అతను గాడిద మీద అడవికి వెళ్తాడు. గుహ ద్వారం తెరుచుకొని లోపలికి అడుగుపెట్టిన అతనికి అన్న తల, మొండెం వేరువేరుగా వేళ్లాడుతూ కనిపిస్తాయి. ఆ స్థితిలో అన్నను చూసేసరికి ఏడుపు పొంగుకొస్తుంది అలీబాబాకి. అయితే అది ఏడుపులకు సరైన సమయం, స్థలం కాదని భావించి అతన్ని గోతాంలో కుక్కి గాడిద మీద వేసుకొని ఇల్లు చేరతాడు. వెళ్లగానే వదినకు మూటను అందిస్తాడు. ఆమె సంతోషంగా...

"సొమ్ము తీసుకొచ్చావ్. సంతోషమేగానీ...నీ అన్న ఏడయ్యా..." అంటుంది.

దానికి అలీబాబా బాధగా "ఆ మూటలో వున్నది అన్న కాశిం శరీరమే వదినా" అంటూ సంగతంతా వివరిస్తాడు. తన మూలంగా భర్త చనిపోయినందుకు ఆమె ఎంతగానో దుఃఖిస్తుంది. శవం మీద పడి విలపిస్తుంది. అయితే పెద్దగా ఏడిస్తే ఊరంతా తెలిసి దొంగలు తమను కూడా చంపేస్తారని భావించిన అలీబాబా ఆమెను వారిస్తాడు. ముందు మొండేనికి తల అతకబెట్టే ఆలోచన చేయమంటాడు. మరి అప్పుడుగానీ శవాన్ని ఖననం చేయడానికి లేదుకదా.

ఊళ్లో మంచి పేరున్న దర్జీని కలిసి తీసుకొస్తే పని సజావుగా పూర్తవుతుందనుకుంటారు అంతా కలిసి. అదే పని చేస్తాడు అలీబాబా. అతనికి బంగారునాణేల ఆశ చూపించే సరికి సరేనంటాడు. అతని కళ్లకు గంతలు కట్టి ఇంటికి తీసుకొస్తాడు. గదిలోకి వచ్చాకే గంతలు విప్పుతాడు. మొండేనికి తల కలిపి కుట్టాక బంగారు నాణేలిచ్చి పంపిస్తాడు. అయితే ఈసారి కూడా కళ్లకు గంతలు కట్టే తీసుకెళ్లి అతని ఇంటి దగ్గర దింపుతాడు. తల, శరీరం కలిపిన తర్వాత అతనికి ఏదో మాయదారి జబ్బు చేసి చనిపోయాడని చెప్పి... ఖననం చేస్తారు. తన దురాశమూలంగా భర్తను పోగొట్టుకున్నందుకు అలీబాబా వదిన ఎంతగానో పశ్చాత్తాపపడింది. కుమిలిపోతూ అలీబాబా పంచన చేరుతుంది. అలీబాబా మాత్రం తన దగ్గర వున్నదాంట్లో పేదసాదలకు దాన ధర్మాలు చేస్తూ భార్యతో సంతోషంగా వుంటాడు.

❀ ❀ ❀

ఓరోజు దొంగల నాయకుడు తన వారితో..."మన సొత్తును కాజేసిన వాళ్లు ఒకరు కాదు. ఇద్దరు. అందుకే ఒకడొచ్చి చచ్చినవాడి శవం తీసుకెళ్లాడు. వాడినెలాగైనా కనిపెట్టాలి. లేకపోతే మన సొత్తంతా వాడే దోచేస్తాడు" అంటూ చురుకైన దొంగకు సామాన్యుడి వేషం వేసి పంపిస్తాడు.

(ఆ దొంగ అలీబాబాను కనిపెడతాడా? తర్వాత ఏం జరుగుతుంది? తెలియాలంటే ఏడు రోజులు ఆ..గా...ల్సిం...దే)

పునఃకథనం: కె. చరిత